## విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...
8333818121

ఎడిటర్
పెనగొండ సతీష్



# తొలి ఆకాంక్ష

TGTEL/25/A1964
akankshanews.com
తెలుగు సంచలన దిన పత్రిక



## రిపోర్టర్లు కావలెను

పామాన్యుడికి అండగా,ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా మాతవంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబుబ్‌నగర్,నాగకర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,సూర్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాలో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

- స్టాఫ్ రిపోర్టర్లు
- మండల
- నియోజకవర్గ రిపోర్టర్లు

కావలెను

Contact Number :
9908333465.8333818121



ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 99 ఎడిటర్ :పెనుగొండ సతీష్ బుధవారం 26 నవంబర్ 2025 పేజీలు 8 వెల 5.00




## జిహెచ్ఎంసి పరిధి

# మరింత విస్తరణ

- ఓఆర్ఆర్ లోపల, బయట ఉన్న మున్సిపాలిటీల విలీనం
- మొత్తం 27 మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో విలీనం
- కొత్తగా మరో విద్యుత్ డిస్కమ్ ఏర్పాటుకు నిర్ణయం
- ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో రామగుండంలో పవర్ ప్లాంట్ ఏర్పాటు
- పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడులకు ఆహ్వానం
- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్25 : జీహెచ్ఎంసీని విస్తరించేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్నా 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సుమారు 4 గంటలకుపైగా వివిధ అంశాలపై చర్చించింది. రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను డిప్యూటి సిఎం,మంత్రి శ్రీధర్‌బాబు,జూపల్లి కృష్ణారావులు మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ లోపల, బయట, ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీ, కార్పొరేషన్లను) జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ,

2 లో

## భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షి

# అయోధ్య

- రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేటితో పూర్ణాహుతి
- ధర్మ ధ్వజం భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం
- ధ్వజారోహణతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయి
- అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధాని మోడీ





(ఆకాంక్ష న్యూస్)

అయోధ్య, నవంబర్ 25 : భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షిగా అయోధ్య నిలిచిందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. అయోధ్య రామాలయం శిఖరంపై జెండాను ఎగురవేసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. జై శ్రీరామ్ నినాదంతో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభిం చారు. రామభక్తుల సంకల్పం సిద్ధించిందన్నారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు

2 లో



## చెక్ డ్యామ్ కూల్చివేత

# ఇసుక మాఫియా పనే



- గుంపుల వద్ద డ్యామ్‌ను పరిశీలించిన హరీష్ రావు

(ఆకాంక్ష న్యూస్)

పెద్దపల్లి, నవంబర్ 25 : కెసిఆర్ హయాంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి మల్లన్న సాగర్ ఎవరు కట్టారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల వద్ద పేల్చిన చెక్ డ్యామ్‌ను పార్టీ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, దాసరి మనోహర్ రెడ్డి, రసమయి బాలకిషన్, నారదాసు లక్ష్మణ్‌రావుతో

2 లో



## మోగిన స్థానిక

# ఎన్నికల నగారా

- మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణ
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడి

(ఆకాంక్ష న్యూస్)


హైదరాబాద్,నవంబర్25 : తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకునోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు చెప్పారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ నేటి నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 29న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాం. కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9న షెడ్యూల్‌పై

2 లో

## నగరంలో ఉన్న విలువైన

# భూములు హాంఫట్

- 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ
- రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెడుతున్న సిఎం రేవంత్
- రాత్రికి రాత్రే బిలియనీర్ కావాలన్న లక్ష్యంతో కదుపుతున్న పావులు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 25 : సిఎం రేవంత్ రెడ్డి అవినీతి కోసమే హిల్ట్ పాలసీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ అని అన్నారు. విద్యార్థులు, రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెడుతూ రేవంత్ సర్కార్ హిల్ట్ పాలసీకి నిర్ణయం తీసుకుందని కేటీఆర్ అన్నారు. ఒకప్పుడు పరిశ్రమలు, ప్రజల ఉపాధి కోసం ఇచ్చిన భూములను ప్రైవేటు వ్యక్తులు అపార్ట్‌మెంట్లు కడతామంటే ప్రభుత్వం అనుమతినిస్తోందని తెలిపారు. దాదాపు 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీని తీసుకొస్తున్నారని కేటీఆర్ తెలిపారు. దాదాపు ఆ భూములన్నింటికీ రేవంత్ సోదరులు, అనుయాయులు ఒప్పందాలు చేసుకున్నారని పేర్కొన్నారు. లక్షన్నర గజం విలువ చేసే భూమికి 10 వేలు కడితే చాలని పాలసీ తెచ్చారని తెలిపారు. పారిశ్రామిక వాడల భూములను అమ్మి 4-5లక్షల కోట్ల కుంభకోణం చేయాలని చూస్తున్నాడని

2 లో

# చెక్‌డ్యామ్‌లు కుప్పకూలడంపై అనుమానం

- లోతైన దర్యాప్తు జరిపించాలన్న బండి
- సిఎం రేవంత్ రెడ్డికి లేఖ

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 25 : తెలంగాణలో చెక్ డ్యామ్‌లు కూలిపోవడంపై అనుమానాలున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. వీటిపై విచారణ జరగాలని అన్నారు. ఎందుకు ఇలా జరుగుతున్నా యో తేల్చాలన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మానేరు నదిపై కట్టిన చెక్ డ్యామ్‌లు కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనుగుల- గుంపుల వద్ద చెక్ డ్యామ్ కూలడమే ఇందుకు నిదర్శనమన్నారు. బిఆర్ఎస్ పాలనతో కమీషన్లకు కక్కుర్తి పడి నాణ్యతను గాలికొదిలేయడం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో చెక్ డ్యామ్‌లను నిర్మించిన కాంట్రాక్టర్లు కాంగ్రెస్ వాళ్లేనని అన్నారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణం, నిధుల చెల్లింపులపై మీరు ఆదేశించిన విజిలెన్స్ విచారణ ఏమైందని బండి




ప్రశ్నించారు. ఆనాడు బాధ్యులపై చర్యలు తీసుకొని దిద్దుబాటు చర్యలు తీసుకొని ఉంటే తనుగుల-గుంపుల చెక్ డ్యామ్ కూలేది కాదన్నారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తూ డ్రామాలాడుతున్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే చెక్ డ్యామ్‌ల నిర్మాణాల్లో అక్రమాలు, కూలిపోవడంపై

2 లో

# ఎన్నికల కోసమే ఇందిరమ్మ చీరలు

- అరకొరగా మహిళలకు పంపిణీ
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



(ఆకాంక్ష న్యూస్)

సిద్దిపేట, నవంబర్ 25 : కేసీఆర్ ప్రతి బతుకమ్మ పండగకి 18 ఏళ్లు నిండిన 1.30కోట్ల మంది మహిళలకు చీరలు అందిస్తే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లో ఉన్న 46లక్షల మందికే చీరలు ఇస్తున్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు విమర్శించారు. కేవలం ఎన్నికల కోసమే ఇదంతా చేస్తున్నారని అన్నారు. సిద్దిపేట జిల్లాలో

2 లో

# ఐ బొమ్మ రవిని మేమే పట్టుకున్నాం

- ఆయన భార్య ఎలాంటి సమాచారం ఇవ్వలేదు
- సీసీఎస్ అడిషినల్ సీపీ శ్రీనివాస్

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్,నవంబర్25 : ఐబొమ్మ రవి కేసుకు సంబంధించి అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. కీలక సమాచారాన్ని రాబడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఐబొమ్మ రవి కేసుపై సీసీఎస్ అడిషినల్ సీపీ శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవికి బెట్టింగ్, గేమింగ్ యాప్స్ ద్వారా డబ్బులు వచ్చేవని అన్నారు. యాడ్ బుల్ కంపెనీ రవికి చెందినదేనని తెలిపారు. యాడ్స్ ద్వారా వచ్చిన డబ్బుల్ని యాడ్ బుల్ కంపెనీకి మళ్లించారని చెప్పారు. ఇమంది రవి ఇప్పటి వరకు 20 కోట్ల రూపాయల వరకు సంపాదించాడని వెల్లడించారు. . 'ఐబొమ్మ, బప్పం సైట్లను రవి స్నేహితుడు నిఖిల్ డిజైన్ చేశాడు. ఐబొమ్మ రవి ఓవర్ కాన్ఫిడెన్స్‌తోనే దొరికాడు. రవి

2 లో



# జిహెచ్ఎంసి సమావేశంలో గందరగోళం

## – వందేమాతరం గీతానికి అవమానం
## – సీట్లలోంచి లేవని..ఎంఐఎం సభ్యులు
## – బిజెపి అభ్యంతరంతో తీవ్ర వాదోపవాదాలు

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్,నవంబర్25 : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో మంగళవారం తీవ్ర గందర గోళం నెలకొంది. వందేమాతరం, జయ జయహే తెలంగాణ గీతాల ఆలాపన సమయంలో మజ్లిస్ కార్పొరేటర్లు కుర్చీలో నుంచి లేవలేదు. దీంతో బీజేపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వందేమాతర గీతం పాడితేనే దేశంలో ఉండాలంటూ వారు బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో బీజేపీకి వ్యతిరేకంగా ఎంఐఎం కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు.

# రేపు పాపన్నపేట సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

## - ఆలయ పూజారి విశ్వనాథ శర్మ

(ఆకాంక్ష న్యూస్)



మెదక్, నవంబర్ 25 : మండల కేంద్రమైన పాపన్నపేటలోని సాయిబాబా ఆలయ 16వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి చెరువుపల్లి విశ్వనాథ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 08.00గం.కు గణపతి పూజ, పాలతో అభిషేకం అనంతరం రమ సమేత సత్యనాయణ స్వామీ వ్రతం, మధ్యానం హారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అనంతరం రామారపు వీరేశం గుప్తా దంపతులచే అన్న ప్రసాదాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో గలాభా

## – కౌన్సిలర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మేయర్
## – ఏకవచన సంబోధన ఏంటంటూ ప్రశ్న

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 25 : జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్‌లో అంశాలపై చర్చ కంటే.. నేతల మధ్య వాగ్వాదమే ఎక్కువగా జరుగుతుంటుంది. ఈ విషయంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కొంత మంది కార్పొరేటర్లు అగౌరవంగా మాట్లాడుతున్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడిన ఆమె.. కొంతమంది కార్పొరేటర్లు అగౌరవంగా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్‌లో హుందాగా, గౌరవంగా మాట్లాడాలని సభ్యులకు సూచించారు. మేయర్‌ను 'నువ్వు, నిన్ను, నీతో' అంటూ ఏకవచనంతో సంభోదించడం ఏంటని ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశంలో కొత్త వారికి మాట్లాడే అవకాశం ఇద్దామన్న మేయర్.. మాట్లాడే అవకాశం ఎవరికి ఇవ్వాలో మేయర్‌గా తానే నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. ఎవరికి మైక్ ఇవ్వాలో నాకు ఎవరూ చెప్పాల్సిన అవసం లేదన్నారు. ప్రజలు ఈ సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షిస్తున్నారని.. సభలో అందరూ హుందాగా మెలుగుతూ ఆదర్శంగా నిలవాలని ఆమె సూచించారు. ఎవరికి వారు స్వతహాగా మాట్లాడుతారని.. పక్క వాళ్లు డైరెక్షన్లు ఇవ్వడం మానుకోవాలన్నారు. కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లతో మేయర్ ఎంత గౌరవంగా వ్యవహరిస్తారో.. కార్పొరేటర్లు కూడా అంతే గౌరవంగా వ్యవహరించాలని సూచించారు.కౌన్సిల్ సమావేశంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, బీఆర్ఎస్ కార్పొరేటర్ సామల హేమ మధ్య మాటల యుద్ధం నడించింది. మేయర్ కుర్చీకి గౌరవాన్ని ఎలా ఆశిస్తున్నారో.. కార్పొరేటర్లకు కూడా అదే విధమైన గౌరవం ఇవ్వాలని హేమ విజ్ఞప్తి చేశారు. గతంలో ఆఫ్టాల్ కార్పొరేటర్లు అని మేయర్ సంభోదించారంటూ హేమ గుర్తు చేశారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025

## – ముఖ్యమంత్రి సమీక్ష సమావేశాలు ప్రారంభం

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్,నవంబర్25 : డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహణ, సంబంధిత ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వివిధ విభాగాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ కు తుది మెరుగులు దిద్దుతున్నారు. మంగళవారం నుంచి నవంబర్ 30 వరకు కమాండ్ కంట్రోల్ సెంటర్లో వరుసగా ఈ సమీక్ష సమావేశాలు జరుగుతాయి. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్బాబు వరుసగా జరిగే అన్ని సమావేశాల్లో పాల్గొంటారు. ఆయా విభాగాల సమీక్షలో సంబంధిత మంత్రులు పాల్గొంటారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహణ ఏర్పాట్లు తదితర అంశాలపై మంగళవారం సీఎంతో పాటు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఆయా విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. బుధవారం మౌలిక వసతులు, అభివృద్ధిపై సీఎంతో పాటు మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, సీతక్క, మోహమ్మద్ అజరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. సంబంధిత విభాగాల అధికారులు పాల్గొంటారు. నవంబర్ 28న విద్య, యువజన సంక్షేమంపై సాయంత్రం 4 గంటలకు సీఎంతో పాటు మంత్రులు వాకాటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, సంబంధిత విభాగాల అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 6 గంటలకు టూరిజం, టెంపుల్ టూరిజంపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ సంబంధిత అధికారులతో సమీక్షిస్తారు. నవంబర్ 29 వ్యవసాయం, సంక్షేమ విభాగాలతో సాయంత్రం 4 గంటలకు: మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వాకాటి శ్రీహరి సంబంధిత అధికారులుతో సమీక్షిస్తారు. సాయంత్రం 6 గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , సీతక్క, మోహమ్మద్ అజరుద్దీన్ పాల్గొంటారు. నవంబర్ 30న ఆరోగ్య రంగంపై సీఎంతో పాటు మంత్రి దామోదర్ రాజనరసింహ సంబంధిత అధికారులు పాల్గొంటారు.

# చెక్‌డ్యామ్‌లు కుప్పకూలడంపై అనుమానం

మొదటిపేజీ తరువాయి

విచారణ జరిపించాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారి ఆస్తులు జప్తు చేసి ఆ సొమ్ముతోనే మళ్లీ డ్యామ్‌లు నిర్మించాలని బండి సంజయ్ లేఖలో పేర్కొన్నారు.

# ఎన్నికల కోసమే ఇందిరమ్మ చీరలు

మొదటిపేజీ తరువాయి

3.83లక్షల మంది మహిళలుంటే 1.99లక్షల మందికే చీరలు ఇచ్చారని చెప్పారు. జిల్లా కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పండగ.. పండగకి సంక్షేమ పథకాలు ఇస్తే రేవంత్‌రెడ్డి ఓట్ల ఓట్లకు సంక్షేమ పథకాలు ఇస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు.ఒక్క ఏడాదికి మాత్రమే చీర ఇచ్చి సారె పెట్టానని రేవంత్‌రెడ్డి అంటున్నారు. చీర ఇచ్చాను సర్పంచ్ ఎన్నికల్లో మహిళలంతా ఓట్లు వేయండని చెబుతున్నారని మండిపడ్డారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తానన్న నెలకు రూ.2,500 సంగతి ఏమైంది? రెండు చీరలు ఇస్తామని చెప్పి ఒక్కటే ఇచ్చిన మీకు మహిళలు ఎందుకు ఓటేయ్యాలి? పట్టణ ప్రాంతాల్లో ఎన్నికలు లేవు కాబట్టి చీరలు లేవు.. వడ్డీలేని రుణాలు లేవు. మహిళా సంఘాలు రూ.25వేల కోట్ల రుణాలు తీసుకుంటే రూ.5వేల కోట్లకు మాత్రమే వడ్డీలేని రుణం వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం 20 పైసలు ఇస్తూ 80 పైసలు ఎగనామం పెడుతోంది. మొత్తం డబ్బులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. గతంలో స్త్రీనిధి

కింద వడ్డీలేని రుణాలు ఇచ్చాం. ఇప్పుడు ఇవ్వట్లేదు. ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలోని మహిళా సంఘాలకు ఒక్క ఆర్టీసీ బస్సు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఇస్తామని నేటికి రెండేళ్లు అయినా ఒక్క మెగావాట్ పవర్ కూడా పెట్టలేదన్నారు.

# ఐ బొమ్మ రవిని మేమే పట్టుకున్నాం

మొదటిపేజీ తరువాయి

భార్య మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. మరికొన్ని పైరసీ వెబ్‌సైట్లు నడుస్తూనే ఉన్నాయి. మూవీరూల్జ్, తమిళ్‌ఎంవీ లాంటి పైరసీ సైట్లు ఇంకా నడుస్తున్నాయి. పైరసీ సైట్ల నిర్వాహకులను పట్టుకునే పనిలోనే ఉన్నాం. ఐబొమ్మ పాపులర్ అయ్యాక.. దానిపేరును చాలామంది వాడుకుంటున్నారు. సినిమా సమీక్షలకు కూడా ఐబొమ్మ సైట్ పేరు వాడుకుంటున్నారు. భవిష్యత్‌లో వెబ్–3 టెక్నాలజీ కూడా రాబోతుంది. వెబ్–3 టెక్నాలజీతో పైరసీ చేస్తే పట్టుకోవడం కష్టం' అని అన్నారు. కాగా, నిన్న(సోమవారం) సాయంత్రంతో ఐబొమ్మ రవి కస్టడీ ముగిసింది. చివరి రోజు కస్టడీలో అధికారులు 3 గంటల పాటు అతడ్ని విచారించారు. విచారణలో రవి నుంచి పోలీసులు ఎలాంటి సమాధానాలు రాబట్టలేకపోయారని తెలుస్తోంది.

# మహిళలను ఆర్థికంగా బలోపేతమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు వ్యాపారంలో రాణించేందుకు గాను వారికి ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷–లాంట్లను ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. దీనికి తోడు వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు కూడా అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూధన్ గౌడ్, డీఆర్డీవో రఘువరన్, ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్, తహసీల్దార్ ఆనంద కుమార్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఆరఐ శ్రీనివాస్, ఏపీఎంలు రవివర్మ, రమాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, సీసీలు స్వామి, తిరుపతి, శశికుమార్, మండల సమాఖ్య సభ్యులు కవిత, రూపకళ తదితరులున్నారు.

# నగరంలో ఉన్న విలువైన భూములు హాంఫట్

మొదటిపేజీ తరువాయి

అన్నారు. అంబానీ, అదానీలను ఒకే దెబ్బకు క్రాస్ చేయాలని రేవంత్ రెడ్డి స్కెచ్ వేశారని తెలిపారు. రేవంత్ రెడ్డి మనుమలు, మునిమలు కూర్చొని తిన్నా కూడా అరిగిపోని ఆస్తిని వెనకేసుకోవాలని ఈ స్కామ్‌కు తెరతీశాడని చెప్పారు. 50–60 ఏళ్లుగా హైదరాబాద్‌లో 21 పారిశ్రామికవాడలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ప్రజల భూములు తీసుకుని ప్రభుత్వం పరిశ్రమలకు ఇచ్చిందని చెప్పారు. నగరం విస్తరిస్తున్న కొద్దీ పరిశ్రమలు మధ్యలోకి వచ్చాయని తెలిపారు. మేం అధికారంలో ఉన్నప్పుడు కూడా పారిశ్రామిక భూముల రెగ్యులరైజేషన్ ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. కాలుష్యం లేని పరిశ్రమలు లేదా కంపెనీలు ఏర్పాటు చేయాలని సూచించామని చెప్పారు. అందుకే మేం గ్రిడ్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. గతంలో 50 శాతం ఐటీ ఆఫీసులకు, 50 శాతం ఇతర అవసరాల కోసం ప్రభుత్వానికి తగిన ఫీజులు కట్టినంకనే అవకాశం ఇచ్చామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం ధారాదత్తం చేస్తోందని అన్నారు. భూదందాపై విద్యార్థి నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. హిల్ట్ పాలసీపై కౌన్సిల్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు నిలదీశారని కేటీఆర్ గుర్తుచేశారు.తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత విద్యార్థులకు కూడా ఉందని తెలిపారు. విద్య, ఉపాధి, కాంట్రాక్టులు, రాజకీయాల్లో 42 శాతం కోటా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ అనేక హామీలిచ్చిందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపు కోర్టు ఆపింది.. మిగతావి ఎవరు ఆపారని ప్రశ్నించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ముస్లింలందరికీ న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. ముస్లింలకు 4 వేల కోట్లు బడ్జెట్‌లో పెడతామని.. పెట్టలేదని మండిపడ్డారు.తెలంగాణపై బీఆర్ఎస్‌కు ఉన్న ప్రేమ ఏ పార్టీకి ఉండదని కేటీఆర్ అన్నారు. తెచ్చిన తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే అని పేర్కొన్నారు. తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత విద్యార్థులకు కూడా ఉందని తెలిపారు. కాంగ్రెస్ అరాచకాలపై విద్యార్థి రణభేరీ మోగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. నాయకులు సమాజం నుంచి వస్తారు.. నాయకుల చుట్టూ తిరిగితే నాయకులు కారని వ్యాఖ్యానించారు.

# మోగిన స్థానిక ఎన్నికల నగారా

మొదటిపేజీ తరువాయి

స్టే విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ ఓటర్లు 1.66 కోట్ల మంది ఉన్నారు. 4,200 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు తొలి దశలో ఎన్నికలు నిర్వహిస్తాం అని ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. గురువారం నుంచి తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30 నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలు, 38,350 వార్డులకు పోలింగ్ జరగనుండగా.. మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలు, 36,452 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

మొదటిపేజీ తరువాయి

చెందిన దుర్గం సంతోష్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో బలంగా ఢీ కొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయలపాలైన రాజేష్, తన కూతురు అద్వికలను మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకి తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచనమేరకు మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స ను అందించినట్లు పేర్కొన్నారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం రాజేశ్ ఉదయం మృతి చెందినట్లు వివరించారు.

# చెక్ డ్యామ్ కూల్చివేత ఇసుక మాఫియా పనే

మొదటిపేజీ తరువాయి

కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యామ్‌ను కూల్చివేసింది కాంగ్రెస్ నేతలేనన్నారు. కాంగ్రెస్ హయంలో చెరువులు, చెక్ డ్యామ్‌ల పేల్చివేత నిత్య చర్యగా మారిందన్నారు. గతంలో పెద్దపల్లి భోజన్న పేట వద్ద హుస్సేన్ మియావాగుపై కూడా చెక్ డ్యామ్ పేల్చివేశారని ఆరోపించారు. గుంపుల వద్ద చెక్ డ్యామ్ కూడా కులలేదని.. పేల్చారని ఇక్కడి రైతులే చెప్తున్నారన్నారు. ఇసుక మాఫియానే కూల్చివేసిందని, కాంగ్రెస్ పాలనలో వేల కొద్ది లారీల్లో ఇసుక తరలిస్తున్నారన్నారు. రాత్రికి రాత్రి చెక్ డ్యామ్ పేల్చేశారని.. భోజన్నపేటలో హుస్సేన్ మియావాగుపై చెక్ డ్యామ్ పేల్చివేస్తుంటే రైతులే పట్టుకున్నారన్నారు. అప్పుడు రైతులే కేసులు పెట్టారని.. పోలీసులు ఇప్పటివరకు దోషులను పట్టుకోలేదని ఆరోపించారు. తాజాగా మరో చెక్ డ్యామ్ పేల్చారని.. అప్పుడే పోలీసులు దోషులను శిక్షిస్తే.. ఈ రోజు గుంపుల చెక్ డ్యామ్‌కు ఈ పరిస్థితి రాకుండేదన్నారు. ఈరోజు వరకు పోలీసులు వాళ్లను పట్టుకోలేదని.. మూడు రోజులు అయిన ఇక్కడి పేల్చవేత దోషులను పోలీసులు పట్టుకోలేకపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వాళ్లను కాపాడుతుందని.. ఆనాడు గుండాలను అరెస్ట్ చేస్తే ఈ రోజు ఇక్కడి చెక్ డ్యామ్ పేల్చకపోయేవాళ్లని.. హైదరాబాద్‌లో ఇండ్లు, ఇక్కడ చెరువులు, చెక్ డ్యామ్‌లు కూలగొడుతున్నారన్నారు. కేసీఆర్ కట్టుడు.. కాంగ్రెసోళ్ల కూలగొట్టుడని.. మానేరు నది మీద చెక్ డ్యామ్‌లు కట్టి సస్యశ్యామలం చేశామన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌కు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కట్టిందని.. చర్యలు తీసుకోవాలంటే పొంగులేటిపై తీసుకోవాలన్నారు. రాఘవ కంపెనీని బ్లాక్ చేయాలన్నారు. పొంగులేటి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 6 లక్షల ఎకరాలు నీళ్లు ఇస్తామని ఉత్తమ్ కుమార్ చెప్పిండని.. ఎక్కడ ఇచ్చారో చెప్పాలన్నారు. కమిషన్ల పేరిట కాలయాపన చేస్తున్నారని.. రెండేళ్లు అయిన కాళేశ్వరం రిపేర్ చేయడం లేదని.. కాళేశ్వరం కింద ఉన్న కాలువలు తవ్వడం లేదన్నారు. కాలువలు తవ్వితే కేసీఆర్‌కు పేరు వస్తుందని రైతును గోసపెడుతున్నారన్నారు. కాళేశ్వరం కూలిందని రేవంత్ రెడ్డి అంటున్నాడని.. మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు తీసుకుపోతున్న నీళ్లు కాళేశ్వరంవికావా అంటూ ప్రశ్నించారు. ఈ బ్లాస్టింగ్స్ చూస్తే కాళేశ్వరం కూడా పేల్చారని అనుమానం వస్తుందన్నారు. పెద్దపల్లిలో జిలిటెన్ స్టిక్స్‌తో కాంగ్రెస్ నాయకులు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారని.. ఇసుక మాఫియాతో రూ.24 కోట్లు రికవరీ చేయాలన్నారు. ఎండాకాలం లోపే చెక్ డ్యామ్ నిర్మించాలని.. ఇసుక మాఫియాలో మంత్రుల వాటా ఉందని.. రాత్రిపూట పెద్దశబ్దం వినపడిందని అని మత్స్యకారులు చెప్తున్నారన్నారు. లక్ష క్యూసెక్కుల వరద వస్తే కూడా ఈ చెక్ డ్యామ్ చెక్కు చెదరలేదన్నారు. కూలితే రాత్రే ఎందుకు కూలింది? కూలలేదు కూల్చారు అంటూ ఆరోపించారు. కాంగ్రెస్‌కు రైతుల కన్నా ఇసుక మాఫియా ముఖ్యమన్నారు. టెర్రరిస్టులు కూడా ఇలాంటి పనులు చేయరని, టెర్రరిస్టులకు మించిపోయారని.. ఇసుక మాఫియా దోషులను శిక్షించకుంటే రాష్ట్రంలో మరిన్ని చెక్ డ్యామ్‌లు పేలుస్తారన్నారు. కేసీఆర్‌పై కోపంతో రాష్ట్ర రైతుల నోట్లో మట్టికొడుతున్నారని.. కాళేశ్వరం కూలిందని రేవంత్‌రెడ్డి అంటున్నాడని.. కాళేశ్వరంలో భాగంగా కట్టిన మల్లన్న సాగర్ నుంచి రూ.8వేల కోట్లతో హైదరాబాద్‌కు పైపులైన్ వేస్తా అంటున్నాడన్న హరీశ్‌రావు.. మల్లన్న సాగర్ ఎవరు కట్టారు నీ తాత కట్టిండా..? కేసీఆర్ కాదా? అంటూ ప్రశ్నించారు. ఇసుక మాఫియాపై ఉన్నత స్థాయి విచారణ జరగాల్సిందేనన్నారు. నిందితులు ఎవరైనా వారి నుంచి రూ.24కోట్లు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

# జిహెచ్ఎంసి పరిధి మరింత విస్తరణ

మొదటిపేజీ తరువాయి

పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తుక్కుగూడ, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బోడుప్పల్, నిజాంపేట్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో హైదరాబాద్ పరిధి మరింత పెరుగుతందన్నారు. అంతేకాకుండా మరో విద్యుత్ డిస్కమ్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రులు తెలిపారు. కొత్త డిస్కమ్ పరిధిలోకి లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ కనెక్షన్లు వస్తాయన్నారు. వచ్చే పదేళ్లలో విద్యుత్ డిమాండ్‌కు అవసరమైన ఏర్పాట్లపై చర్చినట్లు వివరించారు. ఈ క్రమంలోనే 3వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు చేయాలని, ఈ మేరకు త్వరలోనే టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ క్రమంలో 2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ కొనుగోలుకు కేబినేట్ ఆమోదించింది.పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడుల ఆహ్వానించాలన ఇనిర్ణయించారు. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకొచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్‌ల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా మన డిస్కమ్‌లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది.కొత్త పరిశ్రమలకు సొంతగా విద్యుత్ తయారీ చేసుకునేందుకు అనుమతి ఇవ్వనున్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రామగుండంలో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం కోసం కేబినేట్ ఆమోదించింది. పాల్వంచ, మక్తల్‌లోనూ ప్లాంట్ల నిర్మాణ అవకాశాలపై పరిశీలన చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌ను 3 సర్కిళ్లుగా విభజించి భూగర్భ కేబుల్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించారు.భూగర్భ విద్యుత్ వ్యవస్థతోపాటు టీ ఫైబర్ కేబుళ్ల ఏర్పాటు చేయనున్నారు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్దనల్లవెల్లిలో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయింపునకు ఆమోదించారు. అలాగే ములుగు జిల్లా జగ్గన్నపేటలో స్పోర్ట్స్ స్కూల్‌కు40ఎకరాలు కేటాయింపు ఇవ్వనున్నారు. జూబ్లీహిల్స్‌తో పాటు రాష్ట్రంలో మరికొన్ని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటుకు నిర్ణయించారు.

# భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షి అయోధ్య

మొదటిపేజీ తరువాయి

పూర్ణాహుతి జరిగిందని చెప్పారు. ధర్మ ధ్వజం కేవలం జెండా కాదని..భారత సంస్కృతి పునర్వికాసానికి చిహ్నమని ప్రధాని మోదీ అభివర్ణించారు. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం చిహ్నమని పేర్కొన్నారు. ధర్మ ధ్వజం శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతుందన్నారు. ధర్మ ధ్వజం ప్రపంచానికి ఒక స్ఫూర్తి, ప్రేరణ ఇస్తుందని స్పష్టం చేశారు. కర్మ,కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మ ధ్వజం వివరిస్తుందన్నారు. పేదలు, దుఃఖితులు లేని సమాజాన్ని మనం ఆకాంక్షిస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయన్నారు. ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగారో అయోధ్య చెబుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయోధ్యలో ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచిందన్నారు. రామభక్తుల సంకల్పం సిద్ధించింది. కోట్లాది మంది కల సాకారమైంది. శతాబ్దాల నాటి గాయాలు, బాధల నుంచి నేడు ఉపశమనం లభించింది. 500 ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైంది. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నమస్కరిస్తున్నా. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగింది. ధర్మధ్వజం కేవలం జెండా కాదు.. భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం ప్రతీక. శ్రీరాముడి సిద్ధాంతాలను ఈ జెండా ప్రపంచానికి చాటుతుంది. స్ఫూర్తి, ప్రేరణను ఇస్తుంది. కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెబుతుందని మోదీ పేర్కొన్నారు. రాముడు కులం చూడడు.. కేవలం భక్తి మాత్రమే చూస్తాడు. ధర్మధ్వజంపై కోవిదార్ వృక్షం మన ఇతిహాసాల వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రధాని తెలిపారు. అయితే మన చుట్టూ కొందరు ఇంకా బానిస భావజాలంతో ఉన్నారు. రాముడు ఓ కాల్పనిక వ్యక్తి అని వారు అంటున్నారు. అలాంటి బానిస భావజాలం ఉన్న వ్యక్తులకు చోటు ఇవ్వొద్దు. భారత్‌లో ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో రాముడు ఉన్నాడు. ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు. ఇది మన డీఎన్ఏలోనే ఉంది. శతాబ్దాల క్రితమే భారత్‌లో ప్రజాస్వామ్య విధానం ఉంది. తమిళనాడులోని ఉత్తర మేరూర్ శాసనం ప్రజాస్వామ్యం గురించి చెబుతోంది. వచ్చే వెయ్యేళ్లు భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటాలి. మానవ వికాసానికి అయోధ్య కొత్త నమూనా ఇస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. కాషాయ జెండా సూర్యవంశానికి చిహ్నమని, ఓం అక్షరం.. కోవింద వృక్షం .. రామరాజ్యానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. సంకల్పానికి, సక్సెస్‌కు ఈ జెండా చిహ్నమన్నారు. వందేళ్ల పోరాటానికి.. రాబోయే వేల శతాబ్దాలకు ఈ జెండా రాముడి విలువలను చాటుతుందన్నారు. సత్యమే ధర్మం అని ప్రధాని మోదీ అన్నారు. వివక్ష, బాధ ఉండకూడదని, శాంతి.. సంతోషం ఉండాలన్నారు. పేదరికం ఉండకూడదని, ఎవరూ నిస్సహాయంగా ఉండరాదన్నారు. గుడికి రాలేని వారు, గుడిపై ఎగురుతున్న జెండాను చూసినా.. వారికి అంతే పుణ్యం దక్కుతుందని మన గ్రంథాలు చెబుతాయని, చాలా దూరం నుంచి కూడా జెండాను చూసి రామ్‌లల్లా పుట్టిన ప్రదేశం ఇదే అన్న ప్రేరణ పొందవచ్చు అన్నారు. ఈ అద్భుతమైన సందర్భంలో కోట్లాది మంది రామ భక్తులకు హృదయ పూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రామాలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడు, కళాకారుడు, ప్లానర్, ఆర్కిటెక్ట్, వర్కర్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.



# నాగ్సాన్పల్లి గ్రామంలో నేడు ఇంద్రమ్మ చీరలు పంపిణీ

మెదక్. నవంబర్ 25(ఆకాంక్ష) : మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్సన్ పల్లి గ్రామంలో మంగళవారం గ్రామపంచాయతీ వద్ద కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పథకంలో భాగంగా ఇంద్రమ్మ చీరలను గ్రామంలోని మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆడ పడుచులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.గ్రామపంచాయతీ సెక్రటరీ భాను కుమార్ అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులైన ఏడుపాయల మాజీ చైర్మన్ నరసింహ గౌడ్, పార్ష నర్సింలు, దండం దుర్గేష్, దేవేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, బెస్గం రవీందర్, ఎర్రం రవీందర్ పోల బోయిన యాదగిరి, తలారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మినీ ట్యాంక్ బండ్‌లో దూకి మహిళ ఆత్మహత్య

పెద్దపల్లిటౌన్. నవంబర్ 25(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్న విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పట్టణంలోని తిలక్ నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న బొడ్డుపల్లి కనకమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మినీ ట్యాంక్ బండ్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కనకమ్మ గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు బంధువులు తెలిపారు. శారీరక నొప్పులు, ఆరోగ్య సమస్యలు మానసికంగా కూడా ఆమెను తీవ్రంగా వేధించి ఉండొచ్చని, ఆ మనస్తాపం కారణంగానే ప్రాణాలు తీసుకుని ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. ఉదయం ఇంటి నుండి బయటికి వచ్చిన ఆమె తిరిగి గృహానికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన వారు వెతికే క్రమంలో మినీ ట్యాంక్ బండ్ వద్ద చీరలు, జాడలు కనిపించానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.దీంతో అందుకున్న పెద్దపల్లి టౌన్ పోలీసు సిబ్బంది తక్షణమే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలనలు ప్రారంభించారు. నీటిలో శోధన చర్యలు చేపట్టగా మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మరణానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మంచిర్యాల.నవంబర్ 25(ఆకాంక్ష) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందిన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే....కుంబాల రాజేష్ (32) తన భార్య మౌనిక, కూతురు అద్విక, కుమారుడు మణివర్షిత్‌లతో కలిసి ద్విచక్రవాహనంపై లక్షెటిపేటలో నిర్వహించిన వివాహ వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో ఉన్నాడు.పాతమంచిర్యాల సమీపంలోని టీ కన్వెన్షన్ హాల్ ఎదుటికి రాగానే ఎదురుగా వస్తున్న గుడిపేట గ్రామానికి చెందిన దుర్గం సంతోష్ నడిపుతున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొనడంతో రాజేష్ కుటుంబం రోడ్డు మీద పడిపోయింది. ప్రమాదంలో రాజేష్, చిన్నారి అద్వికలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడ ఉన్న స్థానికులు వారిని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ మృతి



కరీంనగర్ జిల్లా, నవంబర్ 25(ఆకాంక్ష) : కరీంనగర్ జిల్లా గంగాధర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గరిగంటి కరుణాకర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ చివరికి మంగళవారం అస్పత్రిలో మృతి చెందాడు. కరుణాకర్ మరణం వార్త ర్యాలపల్లి గ్రామంతో పాటు మొత్తం మండలాన్ని విషాదంలో ముంచెత్తింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామానికి చెందిన గరిగంటి కరుణాకర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన విషయం తెలిసిందే. ఈ నియామక సందర్భంగా నవంబర్ 23వ తేదీన కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శించుకోవడానికి ఎమ్మెల్యే కాన్వాయ్ వెళ్లింది.అయితే కొండగట్టు సమీపంలో కాన్వాయ్‌కు ప్రమాదం జరిగింది. అదే కాన్వాయ్‌లో ప్రయాణిస్తున్న కరుణాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటన జరిగిన వెంటనే స్థానికులు మరియు సహచరులు కరుణాకర్‌ను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఆయన ప్రాణాలు కోల్పోయారు. కరుణాకర్ మృతి వార్త తెలిసిన వెంటనే ర్యాలపల్లి గ్రామం విషాద ఛాయల్లో మునిగిపోయింది. మార్కెట్ కమిటీ సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామస్తులు కుటుంబ సభ్యుల వద్దకు చేరుకొని సంతాపం తెలిపారు. ప్రజాసేవ పట్ల కరుణాకర్‌కు ఉన్న నిబద్ధతను అనేక మంది గుర్తుచేసుకున్నారు.

# మహిళా శక్తీకరణకు ప్రభుత్వం దృఢ సంకల్పం

## - మహిళా సంఘాలకు రూ.2 కోట్లు 19 లక్షల 95 వేల 800 వడ్డీ లేని రుణాల పంపిణీ



జగిత్యాల. నవంబర్ 25 (ఆకాంక్ష) :మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పలు సంక్షేమ, సాధికారత కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని మహిళా సంఘాలకు భారీ స్థాయిలో వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. మొత్తం రూ.2 కోట్లు 19 లక్షల 95 వేల 800 విలువ గల రుణాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి మహిళలకు మంత్రి అందజేయడం ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు వ్యాపారరంగంలో ముందుకు సాగేందుకు ప్రభుత్వం విస్తృత చర్యలు చేపడుతోందని, స్వయం ఉపాధి అవకాశాల పరంగా రాష్ట్రవ్యాప్తంగా కొత్త దారులు కల్పిస్తున్నదని పేర్కొన్నారు. మహిళా సంఘాలు అభివృద్ధి కేంద్రంగా మారేందుకు ప్రభుత్వ సహకారం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. వ్యాపారాల్లో మహిళల పాత్ర రోజురోజుకు పెరుగుతోందని, ఇందుకు అనుగుణంగా వారికి అవసరమైన వనరులు, అవకాశాలు, ప్రోత్సాహం అందిస్తామని స్పష్టంచేశారు. అంతే కాకుండా మహిళలకు ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు కేటాయించడం ద్వారా స్వావలంబన దిశగా ముందడుగు వేయించే కార్యక్రమాలు ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. రుణాల పట్ల మహిళల నమ్మకం పెరుగుతోందని, వ్యాపారాలు ప్రారంభించే స్త్రీలు సమాజం మొత్తానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల జీవన ప్రమాణాలు మెరుగు పడాలంటే ఇలాంటి ఆర్థిక సహాయ పథకాలు కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిపాలన యంత్రాంగం తరఫున ఆర్డీఓ మధుసూధన్ గౌడ్, డీఆర్డీవో రఘువరన్, ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్, తహసీల్దార్ ఆనంద కుమార్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఆరబ శ్రీనివాస్, ఏపీఎంలు రవివర్మ, రమాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, సీసీలు స్వామి, తిరుపతి, శశికుమార్, మండల సమాఖ్య సభ్యులు కవిత, రూపకళ తదితరులు పాల్గొన్నారు.

# ఓదెలలో చీరల పంపిణీ ఎన్నికల స్టంట్ మాత్రమే

## - బీజే పీ మండల అధ్యక్షుడు కారెంగుల శ్రీనివాస్ విమర్శ...



ఓదెల, నవంబర్ 25(ఆకాంక్ష) : సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మహిళలకు చీరల పంపిణీపై రాజకీయ వాదోపవాదాలు భగ్గుమన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చీరల పంపిణీ కార్యక్రమం ఎన్నికల ప్రయోజనాల కోసమేనని బీజేపీ ఓదెల మండల అధ్యక్షుడు కారెంగుల శ్రీనివాస్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓదెలలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్నికల ముందు మాత్రమే చీరలు పంచడం ప్రజలను ఆకట్టుకునే అబద్ధపు నాటకమే తప్ప అసలు ప్రజాహితం కాదని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని, మహిళా సంఘాలకు రుణాలు, గ్రామాల్లో వీధిలైట్లు, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులు బీజేపీ ప్రభుత్వ సహకారంతోనే అమలవుతున్నాయని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు అధిక మద్దతు లభిస్తుందన్న భయం కారణంగా కాంగ్రెస్ తొందరపాటుతో చీరల పంపిణీ చేపట్టిందని మండల అధ్యక్షుడు ఆరోపించారు. మహిళల పట్ల నిజమైన అభిమానం ఉంటే ఎన్నికల సమయాల్లో కాకుండా సంవత్సరం పొడవునా రాష్ట్రంలోని ప్రతి మహిళకు సమానంగా చీరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికల్లో మహిళలు తిరస్కరిస్తారన్న భయంతో సీఎం రేవంత్ రెడ్డి చీరల పంపిణీ ద్వారా బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారని మండల అధ్యక్షుడు తీవ్రంగా విమర్శించారు.ఇందిరా గాంధీ పేరుతో చీరల పంపిణీ నిర్వహించడం ప్రజలను భావోద్వేగాలకు గురిచేసే రాజకీయ ప్రహసనమని, సోనియా గాంధీ%-%రాహుల్ గాంధీల మెప్పు కోసం కాంగ్రెస్ నాయకత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. మహిళలకు ఇవ్వాలన్న రూ. 2,500, వృద్ధులకు పెన్షన్ రూ. 4,000, ఆడపిల్లలకు స్కూటర్లు, కళ్యాణలక్ష్మికి తులం బంగారం వంటి హామీల అమలు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చినప్పటికీ ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని మండల అధ్యక్షుడు కారెంగుల శ్రీనివాస్ మళ్లీ ఆరోపించారు.

# సాంకేతిక విద్యను విద్యార్థులందరూ సద్వినియోగపరచుకోవాలి



మంథని. నవంబర్ 25 (ఆకాంక్ష) : మంథనిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం దాతలు అందజేసిన కంప్యూటర్ ల్యాబ్ ను రిటైర్డ్ ప్రిన్సిపాల్ అంబరీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో సాంకేతిక విద్యను విద్యార్థులందరు అందిపుచ్చుకోవాలని, తాను ఈ కళాశాలలోనే ప్రిన్సిపల్ గా పనిచేసి పదవి విరమణ పొందానని, తాను చిట్టచివరిసారిగా పనిచేసిన కళాశాలకు ఏదో ఒకటి చేయాలని ఉద్దేశంతో దాతలను సంప్రదించగా పది కంప్యూటర్లను అందజేశారని అన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సాంకేతిక రంగంలో దూసుకెళ్లాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సలీం మాట్లాడుతూ తన గురువు గారైన అంబరీష్ విద్యార్థిలకు ఎంతో ఉపయోగకరమైన కంప్యూటర్లను అందించడంలో కీలక పాత్ర పోషించారన్నరు. తమ కళాశాలకు కంప్యూటర్లు అందజేసిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ శ్రీరామబట్ల అనిరుద్, వ్యాపారవేత్త వడివేల్ సేవాచి, టెక్నికల్ ఇంజనీర్ ప్రశాంత్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

# మెదక్ జిల్లా కాంగ్రెస్‌లో వర్గ పోరు

## - ఇరు వర్గాల మధ్య తోపులాట

మెదక్.నవంబర్ 25 (ఆకాంక్ష) : మెదక్ జిల్లా శివంపేటలో మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పర్యటన ఉద్రిక్తంగా మారింది. స్థానికంగా కాంగ్రెస్ పార్టీలో బలంగా ఉన్న నవీన్ గుప్తా, సుదర్శన్ గౌడ్ వర్గాల మధ్య పాత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. టీపీసీసీ చీఫ్ బగళాముఖి ఆలయ దర్శనానికి రానుండగా, మహేశ్‌ను ఆలయంలోకి ఎవరి నేతృత్వంలో తీసుకెళ్లాలన్న విషయంలో ఇరు వర్గాలు ఆగ్రహంతో ఎదురు తిరిగాయి. అనుచరులు పరస్పరం నినాదాలు చేసుకుంటూ తలపడగా, పలుచోట్ల తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి వేడెక్కుతుండడంతో పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టారు. నాయకులు పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసినా ఉద్రిక్తత కొంతసేపు కొనసాగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనకు ముందు ఇలా బయటపడ్డ అంతర్గత విభేదాలు, శివంపేటలో కాంగ్రెస్ శక్తి పెంపు ప్రయత్నాలకు ఎదురుదెబ్బగా మారినట్లుగా రాజకీయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. మహేష్ కుమార్ గౌడ్ అనంతరం షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను కొనసాగించినప్పటికీ, సంఘటనపై పార్టీ అధిష్టానం అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం.

# వరిలో కొయ్యకాలను కాల్చవద్దని వ్యవసాయ అధికారుల విజ్ఞప్తి



రామగిరి,నవంబర్ 25(ఆకాంక్ష) : వరిలో కొయ్యకాలను కాల్చే పద్ధతిని వెంటనే మానుకోవాలని రైతులకు మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ సూచించారు. పెద్దపల్లి రామగిరి మండలంలో రైతులతో మాట్లాడిన ఆయన, కోయకాలను భూమిలో కలిపే విధానమే పర్యావరణానికి, నేల సారానికి, రైతు ఆదాయానికి ఉపయోగకరమని స్పష్టం చేశారు.వరిలో కోయకాలను దున్ని భూమిలో కలపడంతో సేంద్రీయ కర్బనం పెరుగుతుందని, నేలలో నత్రజని, బాస్వరం పరిమాణాలు స్వాభావికంగా అధికమవుతాయని పేర్కొన్నారు. కోయకాలను కాల్చడం వలన పొలాల్లో సూక్ష్మ జీవావరణం నాశనమవుతుందని, పర్యావరణ ఉష్ణోగ్రత పెరగడం తోపాటు వాయు కాలుష్యం తీవ్రం అవుతుందని రైతులు అవగాహనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.వరిలో కొయ్యకాళ్లను నీరు ఇచ్చి ఒక బస్తా సింగిల్ సూపర్ ఫాస్పేట్ వేసి 15 రోజులు ఉంచి తర్వాత దమ్ము చేయడం ద్వారా మట్టిలో మురుగి పెరిగి పంటలకు అవసరమైన సేంద్రియ కర్బనం పెరుగుతుందని తెలిపారు. ఈ విధానం రైతుల ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, అధిక దిగుబడులు సాధించడంలో దోహదపడుతుందని వివరించారు.రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని వ్యవసాయ అధికారి పిలుపునిచ్చారు.

# ఎంపీ గడ్డం వంశీకృష్ణకు అధికారులు బహిరంగ క్షమాపణ చెప్పాలి

## - ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఎంపీని అవమానించడం సరైంది కాదు




మంచిర్యాల. నవంబర్ 25(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా పాలకుర్తి, అంతర్గాం మండల కేంద్రాల్లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ పేరును ఆహ్వాన పత్రికలో ఉద్దేశపూర్వకంగా తొలగించడం తీవ్రమైన వివాదానికి దారితీసింది. అధికార పార్టీ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, బీజేపీ–టీఆర్ఎస్ ఎమ్మెల్సీల పేర్లు ప్రత్యేకంగా ప్రదర్శించగా ప్రజల ఓట్లతో 1,50,000 భారీ మెజార్టీతో గెలిచి ప్రజాభిమానాన్ని సొంతం చేసుకున్న దళిత నాయకుడైన ఎంపీ వంశీ కృష్ణ పేరును తొలగించడం, పెద్దపల్లి పార్లమెంట్ పరిధి నాయకుల తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. పార్లమెంటులో ప్రజల సమస్యలను నిరంతరంగా లేవనెత్తుతూ, ప్రజల మధ్య ఎప్పుడూ కనిపిస్తూ, ప్రజా సంక్షేమం కోసం పోరాడుతున్న నాయకుడిపై అసూయ, రాజకీయ భయం, గుర్తింపు కోల్పోతామన్న భ్రాంతితోనే ఈ చర్యలు జరుగుతున్నాయంటూ నేతలు మండిపడ్డారు. జిల్లాలో ఎంపీ వంశీకృష్ణకు పెరుగుతున్న ప్రజాదరణను తట్టుకోలేక కొందరు శక్తులు కావాలనే అవమానించే ప్రయత్నం చేస్తున్నాయని అభిప్రాయం వ్యక్తమైంది. ఇది ఒక్క సంఘటన కాదని, వరుస అవమానాలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. కాళేశ్వరం పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ఎంపీ ఫోటోను తొలగించడం, ఈఎస్ఐ హాస్పిటల్ పరిశీలన పర్యటనకు ముందే సమాచారం ఇచ్చినా అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం, ప్రజా ప్రతినిధిని పట్టించుకోని ధోరణి కొనసాగుతోందని దళిత నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుడనే కారణంతోనా మా ఎంపీని అవమానిస్తారు? ఇది అధికారుల నిర్లక్ష్యమా? లేక ఏదో సమూహం చేసే కుట్రా? అగ్రవర్ణ అజమాయిషీ ఇంకా కొనసాగుతోందా?" అని వారు ప్రశ్నించారు. ప్రజలతో సమానత్వ భావనను పాటించాల్సిన ప్రభుత్వ యంత్రాంగమే ఇలా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి ధిక్కారమని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితులను ప్రజల ముందుకు తీసుకువస్తూ, బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, అవమానకరంగా వ్యవహరించిన అధికారులు బహిరంగ క్షమాపణ చెప్పాలనే డిమాండ్‌తో శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో భారీ స్థాయిలో నిరసన ప్రెస్ మీట్ నిర్వహించారు. జిల్లా మొత్తం ఈ అంశాన్ని గమనిస్తోందని, ఇకపై ఇలాంటి అవమానాలు జరగనీయబోమని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుధమల హరికృష్ణ, తాజ్ బాబా, తోకల సురేష్, చిట్టి బాద్షా, అంజద్ ఖాన్, నల్ల రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి గనుల్లో నిరసన

## - నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చెయ్యకపోతే నిరవధిక సమ్మె





గోదావరిఖని. నవంబర్ 25(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా రామగుండం రీజియన్ పరిధిలోని సింగరేణి గనుల్లో మంగళవారం నిరసన కార్యక్రమాలు ఉధృతంగా సాగాయి. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు గనుల్లో పని చేస్తున్న కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆర్జీ-1 ఏరియా పరిధిలోని 1 ఇంక్లైన్, 2 ఇంక్లైన్ 2ఏ, 11 ఇంక్లైన్ గనుల్లో కార్మికులు ఏకగ్రీవంగా పాల్గొనడం గమనార్హం. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఐ కృష్ణ మాట్లాడుతూ స్వతంత్ర భారతంలో అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మలచడం కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయమని విమర్శించారు. కార్మికుల హక్కులను హరిస్తూ, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్పులు చేశారన్నారు. శ్రమను దోచుకునే విధంగా, కార్మిక ఉద్యమాలను అణచివేయడానికి మాత్రమే ఈ కోడ్స్‌ను తీసుకొచ్చారని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, ఉద్యమాలు ఆందోళనలు కొనసాగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం చర్చలకు కూడా వీలివ్వకుండా నిరంకుశంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ నాలుగు లేబర్ కోడ్స్ భవిష్యత్తులో కార్మిక వర్గానికి 'ఉరి తాళ్ల'లా మారే ప్రమాదం స్పష్టమని తెలిపారు. వెంటనే ఈ చట్టాలను రద్దు చేయకపోతే సింగరేణి కార్మికులు నిరవధిక సమ్మెకు వెనకాడబోమని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ నరేష్, ఈదునూరి రామకృష్ణ, రామగుండం రీజియన్ అధ్యక్షుడు ఎస్ ప్రసాద్, చింతల శేఖర్ అధ్యక్ష కార్యదర్శులు), జి రాములు రాష్ట్ర అధ్యక్షులు), ఐ రాజయ్య, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం కొమురయ్య, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై వీధి కుక్కల స్వైరవిహారం

## - ప్రజల్లో భయాందోళనలు...
## - పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో ప్రజల ఆగ్రహం





రామగిరి. నవంబర్ 25(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో వీధికుక్కల బెడద రోజు రోజుకు పెరిగిపోతోంది. పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీలు, మార్కెట్ ప్రాంతాల పరిసరాల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్ మీద ద్విచక్ర వాహనదారులు ఈ కుక్కల దాడులతో భయభ్రాంతులకు గురవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, రాత్రివేళ విధులు ముగించుకుని ఇళ్లకు చేరుకునే ఉద్యోగులు కూడా భయంతో రోడ్లపై నడవాల్సి వస్తోంది. ఇప్పటికే పలువురు కుక్కల దాడికి గురై గాయపడ్డారని నివాసితులు చెబుతున్నారు. అయినప్పటికీ స్థానిక సంస్థలు, పంచాయతీ అధికారులు సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శానిటేషన్ సిబ్బంది లోపం, పట్టణ ప్రణాళికలో నిర్లక్ష్యం, చెత్త బుట్టల వద్ద ఆహారం అందుబాటులో ఉండటం వల్ల కుక్కల సంఖ్య పెరుగుతోందని నాగరిక సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. రాత్రివేళల్లో కుక్కల గుంపులు కనిపించగానే ప్రజలు ఇంటి బయటకు రావడానికే భయపడుతున్నారని తెలుస్తోంది. వెంటనే వీధి కుక్కలను పట్టుకోవడం, టీకాలు వేసి నియంత్రణ చేపట్టడం, చెత్త నిర్వహణలో క్రమశిక్షణ పాటించడం వంటి చర్యలకు చర్యలు తీసుకోవాలని రామగిరి ప్రజలు మండల అధికారులను కోరుతున్నారు. ఈ విషయంపై అధికారులు త్వరితగతిన స్పందించి రామగిరిలో పెరుగుతున్న కుక్కల బెడదను అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# జగిత్యాల జిల్లాలో ప్రేమ పెళ్లి కలకలం

## - ప్రేమ వివాహం నచ్చక అమ్మాయి తరుపు కుటుంబ సభ్యులపై దాడి

జగిత్యాల. నవంబర్ 25(ఆకాంక్ష) : ప్రేమ వివాహం చుట్టూ మరో వివాదం ఉధృతమైంది. మల్యాపూర్‌కు చెందిన యువకుడు ముత్తు కుమార్, ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన మాధవికి వారం రోజుల క్రితం కొండగట్టులో ప్రేమ వివాహం జరిగింది. ఇద్దరూ పెద్దల అనుమతి లేకుండానే వివాహం చేసుకోవడం ఈ సంఘటనకు కారణమైంది. మాధవి తరుపు కుటుంబ సభ్యులు ఈ వివాహాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. ముత్తు కుమార్ ఇంటికి వచ్చిన వారు అతని కుటుంబ సభ్యులపై దాడి చేసి అక్కడ ఉద్రిక్తత సృష్టించారు. సంఘటన స్థలంలో గందరగోళం మధ్య మాధవిని బలవంతంగా వెంట తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ అకస్మాత్ దాడితో ముత్తు కుమార్ కుటుంబసభ్యులు భయాందోళనలకు గురయ్యారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అమ్మాయిని ఎక్కడికి తరలించారనే కోణంలో విచారణ సాగుతోంది. ఇరు కుటుంబాలను విచారించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రేమ వివాహాలు, కుటుంబ వ్యతిరేకత, భావోద్రిక్తతల మధ్య చోటుచేసుకున్న ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# గాయత్రి జూనియర్ కళాశాలలో షీ టీమ్ అవగాహన సదస్సు





పెద్దపల్లిటౌన్, నవంబర్ 25(ఆకాంక్ష) : రామగుండం సిపి ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో క్రిస్టియన్ కాలనీ లోని గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షీ టీమ్ ఇంచార్జ్ ఎస్ఐ లావణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్, చెడు అలవాట్ల నుండి యువకులు దూరంగా ఉండాలని, అమ్మాయిలను వేధించే వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళల రక్షణ కోసం ప్రతిరోజూ బస్టాండ్, ప్రధాన చౌరస్తాలు, కాలేజీల వద్ద షీ టీమ్ పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. ఎవరికైనా వేధింపులు, ఇబ్బందులు ఎదురైతే భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేయాలని, ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఆన్లైన్ లోన్ యాప్స్, సైబర్ మోసాలకు జోలికి పోకూడదని, అలాంటి మోసాలకు గురైతే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా మహిళలకు ప్రమాదం లేదా బెదిరింపులు ఎదురైతే వెంటనే 100 నంబర్‌కు కాల్ చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో గాయత్రి విద్య సంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస, కళాశాల ప్రిన్సిపాల్ కుమార్, షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్, స్నేహలత, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగ అమలు 75 సంవత్సరాల వేడుకలు

## - ఘనంగా నిర్వహించనున్న అంబేద్కర్ యువజన సంఘం




గోదావరిఖని, నవంబర్ 25 (ఆకాంక్ష) : భారత రాజ్యాంగ అమలు 75 సంవత్సరాల వేడుకలను ఘనంగా, విశిష్టంగా నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ నాయకులు బొంకూరి మధు, పులి మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వారు మాట్లాడుతూ... భారత రాజ్యాంగం అందించిన మౌలిక హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం, రిజర్వేషన్ల సౌకర్యం కారణంగానే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబడిన వర్గాలు ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగాన్ని 2 సంవత్సరాల 11 నెలలు, 18 రోజుల పాటు శ్రమించి దేశానికి అందించారని గుర్తుచేశారు. ఈనెల 26 నుంచి డిసెంబర్ 6 వరకు రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించేలా కార్యక్రమం సిద్ధమైందని, 26న రామగుండం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమై పెద్దపల్లి జిల్లాలోని 14 మండలాలు, 3 మున్సిపల్ పరిధుల్లో వేడుకలు కొనసాగనున్నాయని నాయకులు వివరించారు. రాజ్యాంగ విలువలను ప్రజలకు చేరవేయడం, అంబేద్కర్ భావజాలాన్ని యువతలో బలపరచడం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం ఈ వేడుకల ముఖ్యోద్దేశమని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మరియు తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ కు చెందిన సభ్యులు గొర్రె రమేష్, కొంకటి లక్ష్మణ్, కాంపెల్లి సతీష్, ఇరుగురాళ్ల కిష్టయ్య, ఆకునూరి బాలాంకుస్, దాసరి రామస్వామి, శశిభూషణ్, మహేందర్, పంజా అశోక్, గొర్రె నరసింహారావు, యాసాల చిరంజీవి, శంకర్, పోచయ్య, సమ్మయ్య, నవాబ్, శేఖర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రీమెట్రి క్ స్కాలర్షిప్ దరఖాస్తులు సమర్పించాలి

## - అర్హులైన ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకునేలా చర్యలు
## - సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లిబ్యూరో,నవంబర్ 25(ఆకాంక్ష): పెద్దపల్లి జిల్లాలో పెండింగ్ ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ దరఖాస్తులు డిసెంబర్ 31 లోపు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పెండింగ్ ఎస్సి విద్యార్థుల ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ దరఖాస్తుల పై సమీకృత జిల్లా కలెక్టరేట్ లో హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్లో 5 నుంచి 10వ తరగతి చదివే ఎస్సి విద్యార్థులకు, ప్రైవేట్ పాఠశాలలో 9 నుంచి 10వ తరగతి చదివే ఎస్సి విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ ప్రభుత్వం అందిస్తుందని, అర్హులైన ప్రతి ఎస్సి విద్యార్థికి ఈ స్కాలర్ షిప్ చేరే విధంగా దరఖాస్తులు సమర్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 5 నుంచి ఎనిమిదవ తరగతి చదివే ఎస్సీ బాలికలకు సంవత్సరానికి 1500 రూపాయలు, బాలురకు సంవత్సరానికి 1000 రూపాయలు, 9, 10వ తరగతి చదివే బాల బాలికలకు సంవత్సరానికి 3500 రూపాయల స్కాలర్షిప్ అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల ప్రీ మెట్రిక్, దరఖాస్తుల ను పూర్తి స్థాయిలో వెంటనే డిసెంబర్ 31 లోపు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల హెడ్మాస్టర్ల తో సమన్వయం చేసుకుంటూ ఎస్సి విద్యార్థుల్లో పెండింగ్ స్కాలర్ షిప్ దరఖాస్తులు సమర్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అందుబాటులో ఉన్న బృందాలుగా విభజిస్తూ వెంటనే దరఖాస్తులు సమర్పించేలా చూడాలని తెలిపారు. అలాగే పాఠశాలల వద్ద ఎస్సి విద్యార్థుల సమర్పించిన స్కాలర్షిప్ దరఖాస్తు హార్డ్ కాపీలను విద్యార్థుల బయోమెట్రిక్ ఆథాంటికేషన్ పూర్తిచేసి ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల్లో స్కాలర్షిప్ దరఖాస్తు చేసుకోని ఎస్సి విద్యార్థులకు వెంటనే సమాచారం అందించి https://telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకునే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలలో చివరి విద్యార్థి వరకు స్కాలర్షిప్ దరఖాస్తు బయోమెట్రిక్ ఆథాంటికేషన్ పూర్తి చేసుకొని హార్డ్ కాపీలను ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సకాలంలో స్కాలర్షిప్ దరఖాస్తు చేసుకోని పక్షంలో నష్టపోవాల్సి ఉంటుందని, దీని పరిగణలోకి తీసుకొని అత్యంత ప్రాధాన్యత క్రమంలో ఈ పని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్, హెచ్.డబ్ల్యూ.ఓ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జి.ఎం. కాలనీ జోన్‌లో మ్యాన్ పవర్ పెంచాలి... సీఐటీయూ



గోదావరిఖని. నవంబర్ 25(ఆకాంక్ష) : రామగుండం ఏరియా%-%1 పరిధిలోని జి.ఎం. కాలనీలో సేవలు అందిస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పెరుగుతున్న పనిభారం నేపథ్యంలో మ్యాన్ పవర్‌ను పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం సివిల్ డివైజీఎంకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఏరియా విస్తరించినప్పటికీ తగిన సంఖ్యలో కార్మికులను నియమించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని సీఐటీయూ నేతలు పేర్కొన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న అనేక పెండింగ్ సమస్యలను కూడా ఈ సందర్భంగా వారు వివరించారు. ప్రతి నెల ఇవ్వాల్సిన జీత చిట్టీలు సకాలంలో అందడం లేదని, 2021 నుంచి రావలసిన సీఎంపీఎఫ్ చిట్టీలు ఇప్పటికీ జారీ కాలేదని బాధను వ్యక్తం చేశారు. అదేవిధంగా షర్ట్లు, బూట్లు, గ్లౌజులు, మాస్కులు, ఐడి కార్డులు, హాస్పిటల్ బుక్లు వంటి అవసరమైన రక్షణ సామగ్రి ఇప్పటి వరకు ఇవ్వలేదని, వీటిని తక్షణమే పంపిణీ చేయాలని కోరారు. కార్మికులు విధుల్లో ఉన్నప్పటికీ ఆడిటింగ్ సందర్భంగా కనిపించ లేదనే కారణంతో గత అక్టోబరు నెలలో ఆబ్సెంట్‌గా నమోదు చేయడం అన్యాయమని, మస్టర్‌లో తిరిగి చేర్చాలని కోరారు. పని ప్రాంతాలకు వెళుతున్నప్పుడు యూనిఫామ్ షర్ట్లు లేవన్న కారణంతో ఆబ్సెంట్లు వేయడం జరుగుతుండటాన్ని తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. సూపర్వైజర్లు కార్మికులపై అనవసర ఒత్తిడి తెచ్చి మానసిక వేదనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. టూ%-%ఏ మోరి అవతలి ప్రాంతాల్లో కూడా కార్మికులతో పనులు చేయిస్తున్నప్పటికీ తగిన మనుష్య బలం లేకపోవడంతో పని భారంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జి.ఎం. కాలనీతో పాటు ఐబీ కాలనీ, సీఎంపీఎఫ్ కార్యాలయం తదితర దూర ప్రాంతాల్లో కూడా పనులు చేయిస్తున్న పరిస్థితిని ముందుకు తెచ్చారు. ప్రతిపాదిత సమస్యలను సవివరంగా విన్న సివిల్ డివైజీఎం, త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి మేదరి సారయ్య, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆర్జీ-1 అధ్యక్షులు సిహెచ్ ఉపేందర్, జోన్ కార్మికులు పాల్గొన్నారు.

# సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చెయ్యాలి

## - వెల్ఫేర్ బోర్డు నుంచే పథకాలు అమలు చేయాలని జేఏసీ వినతి



పెద్దపల్లిబ్యూరో. నవంబర్ 25(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు మంగళవారం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు వినతిపత్రం సమర్పించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలును ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం. 12ను సవరించాలని, కార్మికుల ఆరోగ్య పరీక్షల పేరుతో సిఎస్సి సంస్థ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, %×ఖీుఖ% జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మణ్, %ఖజ×% జిల్లా కార్యదర్శి జి.వైకుంఠం మాట్లాడుతూ%శొ% భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు గతంలో అమలు చేసిన ప్రమాద మరణ భృతి రూ. 10 లక్షలు, సహజ మరణ భృతి రూ. 2 లక్షలు, శాశ్వత, పాక్షిక అంగవైకల్య భృతులు వంటి నాలుగు పథకాలను ప్రభుత్వం ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పగించడం కార్మిక వ్యతిరేక చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూలై 22, 2025న జీఓ విడుదల చేసిన రెండు రోజుల్లోనే క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ. 250 కోట్లు, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ. 94 కోట్లు, ట్రెయిల్ బ్లెజర్ బ్రోకర్ సంస్థ ద్వారా మొత్తం రూ. 346 కోట్లు బదిలీ చేయడం అక్రమమని, ఇది 1996 కేంద్ర భవన నిర్మాణ కార్మిక చట్టానికి విరుద్ధమని పేర్కొన్నారు. సిఎస్సి హెల్త్ టెస్టుల పేరుతో బోర్డు నిధులను వృథా చేస్తూ కార్మికులకు అందాల్సిన ప్రయోజనాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా 2009 నుండి 2025 వరకు బోర్డులో నమోదైన 28 లక్షల కార్మికుల్లో కేవలం 15 లక్షల మందికే రెన్యువల్ చేసి, ఒక్కొక్కరికి రూ. 2,309 ప్రీమియంగా వసూలు చేసి రూ. 346.36 కోట్లు ప్రైవేట్ కంపెనీలకు అప్పగించారని, మిగతా 13 లక్షల మంది కార్మికులకు అన్యాయం జరుగుతోందని నేతలు వెల్లడించారు. ప్రస్తుతం బోర్డు అమలు చేస్తున్న 12 సంక్షేమ పథకాలలో నాలుగు మాత్రమే బీమా సంస్థలకు ఇచ్చి, వివాహ కానుక, ప్రసూతి సహాయం, ఆసుపత్రి ఖర్చులు, దహన ఖర్చులు వంటి ఎనిమిది పథకాలను నిలిపివేయడం బాధాకరమని వారు పేర్కొన్నారు. హెల్త్ టెస్టుల పేరిట సిఎస్సి సంస్థకు రూ. 463 కోట్లు దారి మళ్లించారని, నిబంధనలు పట్టించుకోకుండా కమిషన్ల కోసం అధికారులు పనిచేస్తున్నారని నేతలు విమర్శించారు. వెంటనే జీఓ నెం. 12ను సవరించి సంక్షేమ పథకాల అమలును తిరిగి బోర్డుకు అప్పగించాలని, అక్రమంగా బీమా సంస్థలకు బదిలీ చేసిన రూ. 346 కోట్లు బోర్డులో జమ చేయాలని, పెండింగ్ క్లెయిమ్స్‌కు నిధులు విడుదల చేయాలని, రెన్యువల్ కాని 13 లక్షల కార్మికుల కార్డులను అత్యవసరంగా పునరుద్ధరించాలని జేఏసీ డిమాండ్ చేసింది. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించింది. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సావనపల్లి వెంకటస్వామి, రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



మంథని, నవంబర్ 25 (ఆకాంక్ష) : మంథనిలో సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి పలు డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సీఐటియు జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్ మాట్లాడుతూ కార్మికులకు ఉరి తాళ్లుగా మారిన 4 లేబర్ కోడ్స్ అమలుకై బిజెపి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ఈ నోటిఫికేషన్ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ఇచ్చిన ఆదేశాల ప్రకారం మున్సిపల్ కార్మికులందరినీ ఆన్లైన్ పోర్టల్ లో పేర్లు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మంథని మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ కార్మికులను కాంటాక్ట్ పద్ధతిలో విలీనం చేయాలని ఈ మధ్యకాలంలో తీసుకున్న కార్మికులను కాంట్రాక్టు లోకి మార్చాలని మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న సబ్బులు నూనెలు చెప్పులు బట్టల కుట్టుకూలీ డబ్బులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లేష్, చందు, గట్టయ్య, రాజయ్య, జంపయ్య, రాజేష్, భాగ్య, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మనిషి జీవితంలో మానసిక ప్రశాంతతే అత్యంత ముఖ్యమైంది

## - మంథని అగ్రికల్చర్ ఏడి, వెల్నెస్ ట్రైనర్ అంజనీ



మంథని,నవంబర్ 25 (ఆకాంక్ష) :మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళ వారం నిర్వహించిన ప్రత్యేక అవగాహనా కార్యక్రమంలో వెల్నెస్ ట్రైనర్ మరియు మంథని అగ్రికల్చర్ ఏడిఅంజనీ విద్యార్థుల ను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో యువత తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, దానిలోనుంచి బయట పడేందుకు మానసిక ప్రశాంతతను అలవాటు చేసుకోవడం అత్యంత ప్రధానమని సూచించారు. జీవితంలో తీసుకునే నిర్ణయాల సమయంలో ఏర్పడే గందరగోళమే ఒత్తిడికి కారణమవుతుందని, ప్రశాంత మనస్తత్వం ఏర్పడినప్పుడు తీసుకునే నిర్ణయాలు సరిగ్గా అంచనా వేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు ఇబ్బందులకు దారి తీస్తాయని విద్యార్థులకు ఉదాహరణలతో అవగాహన కల్పించారు. తల్లిదండ్రులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, వారిని ఇబ్బందులకు గురిచేసే విధంగా ప్రవర్తించవద్దని సూచించిన అంజనీ, నిత్య సాధన ద్వారా మనసును నియంత్రణలో ఉంచుకోవచ్చని తెలిపారు. ఎలాంటి పెద్ద సమస్యైనా వెల్నెస్ ట్రీట్మెంట్ పద్ధతుల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని వివరించారు. కృతజ్ఞతా భావం ప్రతి ఒక్కరిలో ఉండాలని, సహాయం చేసిన వారి పట్ల గౌరవంతో వ్యవహరించే గుణం అభివృద్ధి చేయాలని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సలీం, స్టూడెంట్ కౌన్సిలర్ ఎల్ ఆర్ కె రెడ్డి, అధ్యాపకులు ఆర్ తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖని-2 టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ డీసీపీ బి. రామ్ రెడ్డి



రామగుండం క్రైం. నవంబర్ 25(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. రామ్ రెడ్డి ఐపీఎస్ మంగళవారం గోదావరిఖని-2 టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఇంచార్జీ స్టాఫ్ పనితీరు, రికార్డుల నిర్వహణ, క్రైమ్ ఫైల్స్ పరిశీలన వంటి అంశాలను సమీక్షించారు. డీసీపీని గోదావరిఖని%-%2 టౌన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎన్. ప్రసాద్ రావు పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ రిసెప్షన్ వద్ద ఉన్న ఉమెన్ పోలీస్ అధికారితో మాట్లాడి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల స్వీకరణ, నమోదు విధానం, స్పందన గురించి వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ రైటర్స్ విధులు, డాక్యుమెంటేషన్ వ్యవస్థ, డైలీ రికార్డింగ్ విధానాన్ని కూడా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లోని లాకప్, సీఐ ఛాంబర్, ఎస్ఐ ఛాంబర్, రైటర్స్ రూమ్, కోర్ట్ రూమ్, వాహనాల పార్కింగ్ స్థలం, స్టేషన్ ప్రాంగణ పరిశుభ్రతపై డీసీపీ ప్రత్యేక దృష్టి సారించారు. పోలీస్ కార్యాలయాలు ప్రజా సేవకు ప్రతిబింబం కావాలని, వ్యవస్థీకృత వాతావరణం ముఖ్యమని డీసీపీ అభిప్రాయపడ్డారు. ఈ సందర్శన కార్యక్రమంలో ఎం. రమేష్ ఏసీపీ గోదావరిఖని, ఎన్. ప్రసాద్ రావు గోదావరిఖని-2 టౌన్ ఎస్‌హెచ్ఓ పాల్గొన్నారు.

# ఎస్‌జిఎఫ్ఐ జాతీయ పోటీలకు ఎంపికైనా పెద్దపల్లి కరాటే క్రీడాకారులు

## - రాష్ట్ర స్థాయిలో ముగ్గురికి బంగారు పథకాలు



గోదావరిఖని. నవంబర్ 25(ఆకాంక్ష) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్కూల్ గెమ్స్ ఆఫ్ ఫెడరల్ స్గఫీ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పెద్దపల్లి జిల్లా కరాటే క్రీడ కారులు అత్యంత ప్రతిభ కనబర్చారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో అండర్ 14 విభాగంలో 23,24 తేదిల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సెలెక్షన్ లో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఎం.ముక్తి శ్రీ, సునీహ సుల్తానా, పవన్ కుమార్ బంగారు పథకాలు సాధించారు. - 26 హేమలత మహాజీ,- 20 బాలుర విభాగంలో బి శ్రీమన్ కాంస్య పతకం సాధించారు. డిసెంబర్ 14 నుండి 19 వరకు మధ్యప్రదేశ్ ఇండోర్ లో స్కూల్ గెమ్స్ ఫెడరేషన్ ఇండియా జాతీయ పోటీలకు ముగ్గురు క్రీడాకారులు ఎంపికైయ్యారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పథకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా క్రీడా కారులను జపాన్ షటోరియో కరాటే స్కూల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తగరపు శంకర్, రాష్ట్ర కార్యదర్శి, ఏం రమేష్, కోశాధికారి, శ్రీనివాస్ యాదవ్ , జపాన్ సిటోరియో కరాటే స్కూల్ గౌరవ అధ్యక్షులు రాజ్ కుమార్ స్పందన క్లబ్ సెక్రటరీ డాక్టర్ కే నరేంద్ర సోనీ , స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ గణేష్ రాజ్, సీనియర్ ఇన్స్టక్టర్స్ ఎస్ శ్రీనివాస్, బి పరమేష్, శ్రావణ్ కుమార్ పటేల్, రోహిత్ కుమార్, నిదేశ్ కుమార్, శైలజ, సంజన, అభిజ్ఞ, శుభ శ్రీ, మరియు తల్లిదండ్రులు ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు.

# ప్రోటోకాల్ పాటించని పెద్దపల్లి కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

**- చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్**



గోదావరిఖని. నవంబర్ 25(ఆకాంక్ష) : పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పట్ల అధికార ప్రోటోకాల్ ను పాటించకుండా వ్యవహరించిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ నేత పి. మల్లికార్జున్ చీఫ్ సెక్రటరీకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆయన ఈ మేరకు ఫిర్యాదు పత్రాన్ని సీఎస్‌కు పంపించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రజలు ఎన్నుకున్న ఎంపీని అవమానించే విధంగా కలెక్టర్ వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. గతంలో కూడా ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగినప్పుడు ఉన్నతాధికారుల దస్తకంతో కలెక్టర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాల్సి వచ్చిందని, అయినప్పటికీ మళ్ళీ అదే తీరు కొనసాగించడం విచారకరమన్నారు. ఇటీవల ఈఎస్ఐ హాస్పిటల్ స్థల పరిశీలనకు ఎంపీ రానున్నట్లు ముందస్తుగా సమాచారం ఇచ్చినా, కనీస ఏర్పాట్లు చేయకపోవడం కావాలనే అవమానించడమేనని ఆయన ఆరోపించారు. అలాగే పెద్దపల్లి, అంతర్గాం, పాలకుర్తి ప్రాంతాల్లో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాల్లో కూడా ఎంపీని అధికారికంగా ఆహ్వానించకపోవడం ప్రోటోకాల్‌కు విరుద్ధమని అన్నారు. ఒక్కసారి తప్పు చేసి క్షమాపణ చెప్పిన కలెక్టర్ పదేపదే అదే తప్పు చేస్తుండటం అంగీకారదయోగ్యం కాదని, అలాంటి అధికారి పై విచారణ చేపట్టి తగిన శాసన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తన ఫిర్యాదులో మల్లికార్జున్ స్పష్టం చేశారు.

# హెూం వర్క్ చేయలేదని ఐదేళ్ల బాలుడికి దారుణమైన శిక్ష

**- బాలుడిని చెట్టుకు వేలాడదీసిన వైనం**



నారాయణ్‌పుర్ నవంబర్ 25 (ఆకాంక్ష) : విద్యార్థులు హెూం వర్క్ చేయకపోతే.. టీచర్లు శిక్ష విధించడం సాధారణమే. రెండు దెబ్బలు వేయడమో.. లేక ఏదైనా చిన్న శిక్ష విధిస్తుంటారు. కానీ, ఇక్కడ ఇద్దరు టీచర్లు మాత్రం మితిమీరి.. అమానవీయంగా ప్రవర్తించారు. హెూం వర్క్ చేయలేదని ఐదేళ్ల బాలుడికి దారుణమైన శిక్ష విధించారు. ఆ బాలుడిని చెట్టుకు వేలాడదీశారు. సూరజ్‌పుర్ జిల్లా నారాయణ్‌పుర్‌లోని హంసవాణి విద్యామందిర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల్లో ఒకరు ఈ ఉదంతాన్ని వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ చర్యకు పాల్పడిన టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల వద్ద పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. దీనిపై జిల్లా విద్యాశాఖ స్పందిస్తూ.. దీనిపై దర్యాప్తునకు ఆదేశించామని.. సమగ్ర విచారణ జరుపుతామని పేర్కొంది. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. కాగా, పాఠశాలకు చెందిన సుభాష్ శివహరే అనే వ్యక్తి ఈ చర్యను సమర్థిస్తూ మాట్లాడటం గమనార్హం. ఇది చిన్న శిక్ష అని.. విద్యార్థుల్లో భయం కలిగించేందుకు ఇలా చేశామని వ్యాఖ్యానించాడు. సుభాష్ వ్యాఖ్యలు గ్రామస్థుల ఆగ్రహాన్ని మరింత పెంచాయి.

# కొనుగోలుదారులకు చుక్కలు..

**- ఒకేరోజు భారీగా పెరిగిన పసిడి, వెండి ధరలు..!**



హైదరాబాద్.నవంబర్ 25 (ఆకాంక్ష ) :పసిడి ధరలు కొనుగోలు దారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటికే ఆకాశన్నంటిన ధరలతో సామాన్యులు బంగారమంటేనే బెంబేలెత్తిపోతున్నారు. గత మూడురోజుల కాస్త ఊరటనిచ్చిన ధరలు తాజాగా.. ఒకేరోజు అమాంతం పెరిగాయి. మూడురోజుల నష్టాల తర్వాత దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 24 క్యారెట్ల తులం బంగారం రూ.3500 పెరిగి తులం రూ.1,28,900కి పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.3500 పెరిగి తులానికి రూ.1,28,300కి చేరుకుంది. ఇక వెండి సైతం బంగారం బాటలో దూసుకుపోతున్నది. ఒకే రోజుకు రూ.5,800 పెరిగి.. కిలో ధర రూ.1,60,800కి పెరిగింది. పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో స్థానిక ఆభరణాల వ్యాపారుల నుంచి డిమాండ్ పెరిగిందని మార్కెట్ వర్గాలు తెలిపాయి.ప్రధాన కరెన్సీలతో పోలిస్తే యూఎస్ డాలర్ బలహీనపడడం బంగారం ధరల పెరుగుదలకు దారి తీసిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ (కమోడిటీస్) సౌమిల్ గాంధీ తెలిపారు. విదేశీ మార్కెట్‌లో ఔన్సు బంగారం 0.09 శాతం తగ్గి 4,131.09 డాలర్లకు చేరుకుంది. ఇక వెండి 0.40 శాతం తగ్గి ఔన్సుకు 51.15కి తగ్గింది. ప్రపంచవ్యాప్తంగా స్థిరమైన ట్రెండ్ మధ్య మంగళవారం ఫ్యూచర్స్ ట్రేడ్‌లో బంగారం ధరలు రూ.1,458 పెరిగి రూ.125,312కి చేరాయి. వచ్చే నెలలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటును తగ్గిస్తుందనే అంచనాలు మరింత పెరిగాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (%వీజఴ%)లో డిసెంబర్ డెలివరీకి సంబంధించిన గోల్డ్ ఫ్యూచర్స్ 1.18 శాతం పెరిగి రూ.1,25,312కి చేరుకుంది.అలాగే, సిల్వర్ ఫ్యూచర్స్ కొనుగోళ్ల కారణంగా.. డిసెంబర్‌లో డెలివరీకి వెండి ధర 1.67 శాతం పెరిగి కిలోకు రూ.1,57,065కి పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో డిసెంబర్‌లో డెలివరీకి కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్సుకు 47.8 పెరిగి 4,142 డాలర్లకు చేరింది. డిసెంబర్‌లో డెలివరీకి కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్స్ 1.94 శాతం పెరిగి ఔన్సుకు 51.30 డాలర్లకు పెరిగింది. రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ జిగర్ త్రివేది మాట్లాడుతూ.. మంగళవారం బంగారం ధరలు ఔన్సుకు 4,140 డాలర్లకు చేరిందన్నారు. గత సెషన్‌తో పోలిస్తే లాభాలను నమోదు చేశాయన్నారు. ఫెడ్ వైఖరి నేపథ్యంలో వచ్చే నెలలో వడ్డీ రేటు తగ్గింపు అంచనాలు పెరిగాయన్నారు.డిసెంబర్‌లో 25 బేసిస్ పాయింట్ల రేటు కోత అవకాశం 81 శాతం ఉంటుందని ట్రేడర్స్ ఆశిస్తున్నారని.. వారం కిందట 40 శాతం నుంచి గణనీయంగా పెరిగిందని త్రివేది తెలిపారు. డాలర్ ఇండెక్స్ స్థిరంగా ఉందని, 100 మార్కుపైన ట్రేడవుతోందని..రష్యా–ఉక్రెయిన్ శాంతి ఒప్పందంపై అంచనాలు బంగారం, వెండి లాభాలను పరిమితం చేస్తోందని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ కమోడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి అన్నారు. బులియన్ ధరల భవిష్యత్తుపై అంచనా వేయడానికి పెట్టుబడిదారులు కీలకమైన యూఎస్ డేటా కోసం ఎదురు చూస్తున్నారని రిలయన్స్ సెక్యూరిటీస్ త్రివేది చెప్పారు. సెప్టెంబర్ రిటైల్ అమ్మకాలు, ఉత్పత్తిదారుల ధరల సూచిక డేటా, నిరుద్యోగ వాదనలు అమెరికా ఆర్థిక వ్యవస్థ, ద్రవ్య విధానంపై ఫెడ్ వైఖరి ఎలా ఉండబోతుందో తెలుస్తుందన్నారు.

# ఉపాధి అవకాశాల కల్పనే యాదవ ట్రస్ట్ లక్ష్యం

**- ఈనెల 28న పెద్దపల్లిలో మెగా ఉద్యోగ మేళా**

**-వైసీటి జిల్లా అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్**




పెద్దపల్లిటౌన్,నవంబర్ 25: (ఆకాంక్ష) :పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో యాదవ చారిటబుల్ ట్రస్ట్ తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 28న పెద్దపల్లిలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మారం తిరుపతి యాదవ్ తెలిపారు. మంగళవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ట్రస్ట్ సభ్యులతో కలిసి ఉద్యోగ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ సుమారు1000 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో దాదాపు18 కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని వివరించారు. ఈ కార్యక్రమం పెద్దపల్లి శాంతినగర్‌లోని సబ్–రిజిస్ట్రార్ కార్యాలయం భవన ఆవరణంలో ఉదయం 10 గంటల నుండి ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ జాబ్ మేళాను జిల్లాలోని అన్ని వర్గాల నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ట్రస్ట్ నాయకులు బత్తిని లక్ష్మణ్ యాదవ్,మల్లెత్తుల నాగరాజు యాదవ్,తమ్మడ బోయిన ఓదెలు యాదవ్,సభ్యులు ఎలుక కొమరయ్య,తువ్వ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# శీర్షిక మౌన నేస్తాలు..

భగ భగ మండుటెండలో జడువక మనకు చల్లని నీడతో స్వాగతమిచ్చె చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని

మొక్కలను నాటు నాటించు

బడిపిల్లలకు బెంచిలై,బడిపంతులకు కుర్చీలై ప్రేమతో వారిని బరువనక మోసే చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని, మొక్కలను నాటు, నాటించు

వృద్ధాప్యములో పెద్దకొడుకువోలే చేతికర్రై సేవలందించే చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని, మొక్కలను నాటు నాటించు

దివ్య ఔషధాలు అందించి మహమ్మా రిజబ్బులను నయం చేసే చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని మొక్కలను నాటు నాటించు

విందు వినోదాల్లో మధుర ఫలాలు అందించి నీకు పేరు ప్రఖ్యాతలు తీసుకవచ్చే చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని మొక్కలను నాటు నాటించు

సకాలంలో వర్షాలు అందించి రైతన్నల పాలిట

కల్పవృక్షమైనిలిచే చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని మొక్కలను నాటు నాటించు

మన పుట్టుక నుండిగిట్టేవరకు కష్టసుఖాల్లో పాలుపంచుకుంటు మన మనుగడకు జీవనాధారం నిలిచే చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అని తెలుసుకోని

మొక్కలను నాటు నాటించు..



**రచన మంజుల పత్తిపాటి**
**మాజీ డైరెక్టర్**
**ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ**
**యాదాద్రి భువనగిరి జిల్లా**
**తెలంగాణ రాష్ట్రం**
**చరవాణి 9347042218**

# ప్రొటోకాల్ ఇవ్వడంలో నిర్లక్ష్యం చేసిన అధికారులను సస్పెండ్ చేయాలి



గోదావరిఖని. నవంబర్ 25(ఆకాంక్ష) : పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ప్రొటోకాల్ ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారని, ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలంటూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కామ విజయ్ తీవ్రంగా డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని మున్సిపల్ తీన్ రస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు సమర్పించి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కామ విజయ్ మాట్లాడుతూ, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు రాజ్యాంగపరంగా ఇవ్వాల్సిన గౌరవం, ప్రొటోకాల్ పాటించడం అధికారుల కర్తవ్యమని గుర్తు చేశారు. ఎంపీ వంశీకృష్ణ పట్ల వరుసగా ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం, వ్యవస్థ మౌనం ఎందుకు పాటిస్తుందని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధిని చిన్నచూపు చేస్తూ వ్యవహరిస్తే ఇక సహించేది లేదని ఆయన హెచ్చరించారు.కాక వెంకట స్వామి కుటుంబం పెద్దపల్లి పార్లమెంట్ ప్రజల కోసం ఎన్నో సేవలు, త్యాగాలు చేసిన విషయాన్ని గుర్తుచేసిన కామ విజయ్, అలాంటి కుటుంబాన్ని చిన్నబరిచే ప్రయత్నాలు తగవని వ్యాఖ్యానించారు. ప్రజల ఆశయాలను గౌరవించేలా వ్యవహరించాలని, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు జరిగే అవమానాలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిప్పారపు మధు, జావెద్, ముచ్చకుర్తి మహేష్, శ్రావణ్, శేఖర్, శ్రీకాంత్, సర్దార్, అల్తాఫ్, వినోద్, రవి, రాజ్మహ్మద్, దినేష్, శ్రీనివాస్, విజయ్, రాజు, చరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# రామగుండంలో "బుల్డోజర్ పాలన" నడుస్తోంది...

**- కూల్చివేతల పేరుతో ప్రజల జీవినోపాధిని రోడ్డున పడేస్తున్న ఎమ్మెల్యే- 46 మైసమ్మ గుళ్లు ఎవరి ఆదేశాలపై కూల్చబడ్డాయి..?**

గోదావరిఖని. నవంబర్ 25(ఆకాంక్ష) : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో చిరువ్యాపారుల దుకాణాల కూల్చివేతలు, మైసమ్మ గుడుల కూల్చి వేతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం "ఛలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం" ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. సింగరేణి నిర్మాణం చేస్తున్న నూతన వ్యాపార సముదాయాలలో కూల్చి వేతలకు గురైన చిరు వ్యాపారులకు ఉచితంగా దుకాణాలు కేటాయించాలని, దారి మైసమ్మ గుడులను కూల్చిన వారిపై కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. స్థానిక కళ్యాణ్ నగర్ చౌరస్తా నుండి బీఆర్ఎస్ శ్రేణులతో భారీ ర్యాలీగా బయలుదేరిన కోరుకంటి చందర్‌ను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి జైపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనితో కార్యకర్తలు నినాదాలతో ఆందోళన కొనసాగించారు. అనంతరం కోరుకంటి చందర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో చిరువ్యాపారాల కూల్చివేతల దుష్పరిణామం తీవ్రంగా ఉందని విమర్శించారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నియంతలా వ్యవహరిస్తున్నారని, ప్రజల జీవినోపాధిని రోడ్డున పడేశారని మండిపడ్డారు.



ప్రాంతంలో 46 మైసమ్మ గుళ్లు ఎవరి ఆదేశాలపై కూల్చబడ్డాయి..?దీనిపై ఎమ్మెల్యే స్పష్టమైన ప్రకటన చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పదని స్పష్టం చేశారు.ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన అధికారులపై శిక్షా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీనగర్, ఎన్‌టీపీసీ ఏరియా, ప్రధాన చౌరస్తాలో చిన్న వ్యాపార దుకాణాలను కూల్చివేసి కుటుంబాలను నిరాశ్రయులుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కొత్త దుకాణాలను చిరువ్యాపారులకు ఉచితంగా అప్పగించాల్సిందేనని అన్నారు.రామగుండంలో "బుల్డోజర్ పాలన" నడుస్తోందని, పోలీసు వ్యవస్థను ఉపయోగించి శాంతియుత ఆందోళనను అణచివేయడం దారుణమని కోరుకంటి చందర్ పేర్కొన్నారు. మైసమ్మ గుడులను కూల్చిన వారిపై చర్యలు తీసుకునే వరకు, చిరువ్యాపారులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. బోడ్డు రవీందర్, బాదె అంజలి, చెలకలపల్లి శ్రీనివాస్, మేడి సదానందం, నారాయణదాసు, మారుతి, నూతి తిరుపతి, మేతుకు దేవరాజ్, దొమ్మేటి వాసు, బుర్రి వెంకటేష్, సట్టు శ్రీనివాస్, నీరటీ శ్రీనివాస్, ఇరుగురాళ్ల శ్రావన్, జిట్టవేన ప్రశాంత్ కుమార్, కిరన్ జీ, చింటూ, ఆవునూరి వెంకటేష్, ముద్దసాని సంధ్యా రెడ్డి, లక్ష్మి, రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు తిట్టారనే మనస్తాపంతో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య



నికింద్రాబాద్ నవంబర్25 (ఆకాంక్ష ): హబ్సిగూడలో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య తీవ్ర కలకలం రేపింది. తన నివాస భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. శ్రీచైతన్య పాఠశాలలో బాలిక చదువుకుంటుంది. తల్లిదండ్రులు తిట్టారనే మనస్తాపంతో ఈ దారుణానికి పాల్పడింది. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. సరిగా చదవడం లేదని, మార్కులు తక్కువ వస్తున్నాయని తల్లిదండ్రులు మందలించారని పోలీసులు తెలిపారు.

# ఆరోగ్యం



# వేడి నీళ్లతో స్నానం చేస్తున్నారా?

## 99శాతం మందికి తెలియని అతిపెద్ద రహస్యం..శృంగార జీవితం

చాలామందికి ప్రతిరోజూ వేడి నీళ్లతో స్నానం చేసే అలవాటు ఉంటుంది. ముఖ్యంగా చలికాలంలో పొగలు కక్కే నీళ్లతో స్నానం చేస్తుంటారు. మరికొందరు గడ్డకట్టే చలిలో అయినా చన్నీళ్లతోనే స్నానం చేస్తుంటారు. అయితే వేడినీళ్లతో స్నానం చేయడం వల్ల సంతాన సమస్యలు వచ్చే అవకశాముందట. మహిళలకు పిల్లలు పుట్టకపోవడానికి హార్మోన్ల అసమతుల్యత, గర్భాశయ సంబంధ సమస్యలు వంటి ఎన్నో కారణాలు ఉండవచ్చు. కానీ పురుషులకు మాత్రం వీర్యకణాల నాణ్యత,పరిమాణం అనేవి మాత్రమే ప్రధాన సమస్యలుగా ఉంటాయి. వేడి నీళ్లతో స్నానం చేయడం వల్ల పురుషులకు సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తగిన ఉష్ణోగ్రతలో స్నానం శరీరానికి శ్రేయస్కరం. కానీ ఎక్కువ వేడి నీటితో స్నానం ఆరోగ్యానికి ప్రతికూలంగా మారవచ్చు. చర్మ సమస్యలు, రక్తపోటు సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలను ఇది ప్రేరేపించవచ్చు. అధిక ఉష్ణోగ్రతలు శుక్ర కణాల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. వృషణాలు శరీరంలోని మిగతా భాగాల కంటే కొద్దిగా చల్లగా ఉంటాయి. అధిక ఉష్ణోగ్రతలు వృషణాలను ప్రభావితం చేయడం వల్ల శుక్ర కణాల ఉత్పత్తి, నాణ్యత తగ్గే అవకాశం ఉంటుది. అధిక ఉష్ణోగ్రతలు శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీయవచ్చు. హార్మోన్ల అసమతుల్యత సంతానోత్పత్తి సమస్యలకు దారితీయవచ్చు. అధిక ఉష్ణోగ్రతలు రోగ నిరోధక శక్తిని బలహీనపరిచే అవకాశం ఉంది. బలహీనమైన రోగ నిరోధక శక్తి సంతానోత్పత్తికి అవసరమైన అనేక శరీర ప్రక్రియలను ప్రభావితం చేస్తుంది. అయితే ఈ ప్రభావాలు వ్యక్తి నుండి వ్యక్తికి మారుతూ ఉంటాయి, అనేక ఇతర కారకాలపై ఆధారపడి ఉంటాయి. నిపుణుల సూచనల గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం ఆరోగ్యానికి మంచిది. అధికంగా వేడి నీరు వాడకూడదు. వేడి నీటితో స్నానం చేసేటప్పుడు వృషణాలపై నేరుగా వేడి నీరు పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. వృషణాలను అధిక ఉష్ణోగ్రతల నుండి రక్షించడం చాలా ముఖ్యం. వేడి నీళ్లతో స్నానం చేయడం వల్ల సంతానోత్పత్తిపై నేరుగా ప్రభావం పడుతుందనే శాస్త్రీయ ఆధారాలు లేవు. అయితే అధిక ఉష్ణోగ్రతలు శరీరానికి కొన్ని ప్రభావాలను చూపుతాయి. అందుకే గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.


# షీర్ కుర్మా ఇలా చేసుకోండి

**సాధారణంగా రంజాన్ లేదా ఈద్ సమయంలో ఎక్కువగా షీర్ కుర్మా చేస్తుంటారు. ఈ పండుగల సమయంలో అందరి ముస్లింల ఇళ్లల్లో మాత్రమే కాకుండా రెస్టారెంట్స్ లో కూడా స్పెషల్ గా దీన్ని తయారుచేసి వడ్డిస్తారు. ఈ షీర్ కుర్మా నోట్లో పెట్టుకుంటే అలా జారిపోతుంది. దీని టేస్ట్ మరేఇతర పాయసానికి రాదంటే ఆశ్చర్యం లేదు. కొంతమంది అయితే షీర్ కుర్మా తినడానికే పుట్టాం అని కూడా సరదాగా అంటుంటారు. అయితే ఈ షీర్ కుర్మాని ఇంట్లోనే చాలా టేస్టీగా ఎలా చేసుకోవాలి,దీనిని చేయడానికి ఏమేం పదార్థాలు కావాలో ఇక్కడ చూడండి.**

**షీర్ కుర్మా తయారీకి కావాల్సిన పదార్థాలు** -పాలు 1 లీటర్ -ఎండు ద్రాక్షలు 7 -బాదంపప్పు 10 -జీడిపప్పు 10 -పిస్తా పప్పులు 15 -నెయ్యి 6 టేబుల్ స్పూన్లు -చిరోంజి పప్పు 2 టేబుల్ స్పూన్లు -పంచదార 250 గ్రాములు -కండెన్స్డ్ మిల్క్ 300 ఎంఎల్

**షీర్ కుర్మా తయారీ విధానం** -ముందుగా విడి విడిగా ఎండుద్రాక్ష, జీడిపప్పు, బాదంపప్పు, పిస్తా పప్పుని రాత్రంతా నానబెట్టుకోండి. -తర్వాత నానబెట్టిన ఎండు ఖర్జూరంలోని గింజలు తీసేసి పొడవుగా ఖర్జూరాన్ని చీరుకోవాలి. జీడిపప్పుని చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. బాదంపప్పు చెక్కు తీసేసి సన్నగా తరుగుకోవాలి. పిస్తా పప్పులను కూడా చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. -ఇప్పుడు పాన్ లో 3 టేబుల్ స్పూన్ల నెయ్యి వేడి చేసి అందులో కట్ చేసిన ఈ ముక్కలన్నింటిని వేసేయండి. ఇందులోనే చిరోంజి పప్పు కూడా






వేసి బాగా వేపి పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు పాన్ లో మరో 3 కప్పుల నెయ్యి వేడి చేసి అందులో 1కప్పు సేవియా వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చే దాకా వేయించి పక్కనపెట్టుకోండి -తర్వాత అడుగు మందంగా ఉండే గిన్నెలో 1 లీటర్ పాలు మరిగించుకోవాలి. -పాలు కొంచెం మరిగాక అందులో 300 ఎమ్ఎల్ కండెన్స్డ్ మిల్క్ లేదా పావు కేజీ పంచదార వేసి కలపండి. తర్వాత ఇందులోనే ఎండుద్రాక్ష వేసి బాగా కలపండి. -5 నిమిషాల పాటు మరిగిన తర్వాత అందులో ఫ్రై చేసి ఉంచుకున్న జీడిపప్పు, బాదం,పిస్తా,చిరోంజి పప్పులను వేసి మొత్తం బాగా కలపాలి. -తర్వాత ఇందులోనే ఫ్రై చేసిన సేవియా, అర టీస్పూన్ ఏలకల పొడి వేసి కలపండి. తక్కువ మంట మీద 12 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఒక పొంగు రాగానే దించేయండి. అంతే షీర్ కుర్మా రెడీ.

# బరువు తగ్గాలంటే ఇది తినాల్సిందే..

## జిందగీలో మర్చిపోలేని టేస్ట్,ఇలా చేసుకోండి



జొన్నరవ్వతో చేసిన ఉప్మా ఎప్పుడైనా తిన్నారా? ఇది ఆరోగ్యానికి మంచిది మాత్రమే కాకుండా బరువు తగ్గడంలో కూడా చాలా సహాయపడుతుంది. దీని టేస్ట్ మాత్రం అమృతంతో సమానమే అని చెప్పవచ్చు. అంత రుచికరంగా ఉంటుంది. హెల్తీ బ్రేక్ ఫాస్ట్, వెయిట్ లాస్ రెసిపి అయిన జొన్న రవ్వ ఉప్మా ఎలా చేసుకోవాలి,దీని తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటో ఇక్కడ చూడండి.

జొన్న రవ్వ ఉప్మా తయారీకి కావాల్సిన పదార్థాలు -జొన్న రవ్వ -నెయ్యి -జీడిపప్పు -పోపు దినుసులు -ఉల్లిపాయ -పచ్చిమిర్చి -క్యారెట్ -కొత్తిమీర -కరివేపాకు

జొన్న రవ్వ ఉప్మా తయారీ విధానం -ముందుగా 1 కప్పు జొన్నరవ్వను శుభ్రంగా కడిన తర్వాత అందులో నీళ్లు పోసి 1 గంటపాటు నానబెట్టుకోవాలి.

తర్వాత స్టవ్ మీద కడాయి పెట్టి అందులో 1 టేబుల్ స్పూన్ నెయ్యి వేసి వేడయ్యాక అందులో 1 టేబుల్ స్పూన్ జీడిపప్పు వేసి దోరగా వేయించి పక్కనపెట్టుకోండి. అదే పాన్ లోని నెయ్యిలో పోపు దినుసులు, రెండు ఉల్లిపాయల ముక్కలు, రెండు పచ్చిమిర్చి ముక్కలు, సన్నగా కట్ చేసుకున్న కొంచెం క్యారెట్, కొన్ని పచ్చి బఠాణీలు, కరివేపాకు వేసి వేయించుకోవాలి. -తర్వాత అందులో 3 కప్పుల నీళ్లు, రుచికి సరిపడా ఉప్పు వేసి ఉడికించుకోండి. -నీళ్లు బాగా మరిగిన తర్వాత అందులో నానబెట్టిన జొన్నరవ్వను వేసి కలుపుకోండి. -తర్వాత మూత పెట్టి లో ఫ్లేమ్ మీద మధ్య మధ్యలో కలుపుతూ 10-15 నిమిషాలు ఉడికించుకోండి. -తర్వాత అందులో ముందుగా ఫ్రై చేసుకున్న జీడిపప్పు, కొంచెం కొత్తిమీర తరుగు వేసి కలుపుకోండి. అంతే వేడి వేడి జొన్నరవ్వ ఉప్మా రెడీ.

# మన పూర్వికులు చేపల పులుసు

**మన పూర్వికులు గతంలో చాలా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకునేవారు. వారు వండుకునే విధానం కూడా చాలా సహజసిద్ధంగా ఉండేది. ఎంచుకునే పదార్థాలు కూడా ఎలాంటి రసాయనాలు లేకుండా పండించినవి ఉండేవి. గతంలో చేపలు తినాలంటే చెరువులో ప్రత్యేకంగా పట్టుకొని వచ్చి తినేవారు. ఆ చేపలు కూడా సహజసిద్ధంగా బతికినవే ఉండేవి. అందుకే వాటిని తినడం వల్ల వారికి ఎన్నో రేట్ల శక్తి వచ్చేది. కరోనా లాంటి మరమ్మత్తులను సైతం తట్టుకొని నిలబడ్డారంటే వారు అలాంటి ఆరోగ్యకరమైన ఆహారం తినడమే కారణం. అయితే పూర్వికులు ప్రత్యేకంగా చేసుకునే ఆహార పదార్థాలలో చేపల పులుసు కూడా ఒకటి. ఎలాంటి మసాలాలు లేకుండా దీనిని తయారుచేసుకునేవారు. అసలు పూర్వీకుల పద్దతిలో చేపల పులుసు ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.**

పూర్వీకుల చేపల పులుసు తయారీకి కావాల్సిన పదార్థాలు స్థానికంగా పట్టుకున్న చేపలు ఆవ నూనె పసుపు కారం ఉల్లిపాయలు టమోటా చింతపండు కరివేపాకులు తయారీ విధానం ముందుగా సహజంగా పెరిగిన చేపలను చెరువుల నుంచి పట్టుకొచ్చేవారు. వాటిని శుభ్రంగా కట్ చేసుకొని ఎలాంటి మురికి లేకుండా బాగా కడుక్కునే వారు. ఆ తరువాత ఒక సైజులో ముక్కలను కోసుకునేవారు. ఆ తరువాత ఒక బండపైన.. కొన్ని పండు మిర్చి, ఒక పసుపు కొమ్ము, ఉల్లిపాయ, టొమాటో, కరివేపాకులు వేసుకొని అన్నీ బాగా కలిసే విధంగా మెత్తగా రుబ్బుకునేవారు. అలా రుబ్బుకున్న మసాలాను ఒక పాత్రలో తీసుకొని పక్కన పెట్టుకునేవారు. ఆ తరువాత కట్టెల పొయ్యి మీద ఒక మట్టి పాత్ర



పెట్టుకొని.. అందులో ఆవ నూనె వేసుకునే వారు. ఆ తరువాత అందులో చేప ముక్కలను వేసుకొని వేయించుకునేవారు. అనంతరం దానిపై మసాలా పేస్ట్ వేసుకునేవారు. అనంతరం పులుపు కోసం చింతపండు జ్యూస్ వేసుకొని, చేపల ఉడకడానికి తగిన నీళ్లు పోసుకొని ఉడికించుకునే వారు. ఆ తరువాత గరిట లేకుండానే పులుసును కలుపుతూ ఉండేవారు. చివరికి రుచికి సరిపడా ఉప్పు వేసుకొని పులుసును దించుకునేవారు. నిజం చెప్పాలంటే ఇప్పటికీ మనలో చాలా మంది నానమ్మలు, అమ్మమ్మలు ఈ మాదిరిగానే చేపలు పులుసు చేస్తున్నారు. చాలా మందికి ఇలాంటి చేపల పులుసు తిన్న అనుభవం కూడా ఉండే ఉంటుంది. ఒకవేళ ఉంటే.. ఇప్పుడే మీ ఫ్రెండ్స్‌కు కూడా షేర్ చేయండి.



# కర్డ్ రైస్ ఈ పద్ధతిలో చేసుకుంటే బాడీలో వేడి మొత్తం దిగిపోతుంది

సాధారణంగా మనలో చాలామంది హెూటల్స్ లేదా రెస్టారెంట్స్ కి వెళ్లినప్పుడు అక్కడ కర్డ్ రైస్ లేదా పెరుగు అన్నం తినడానికి ఇష్టపడతారు కానీ ఇంట్లో ఉన్నప్పుడు మాత్రం దానివైపే చూడరు. దీనికి కారణం టేస్ట్ మాత్రమే కాదు అది కనిపించే విధానం కూడా. రెస్టారెంట్ లో అందించే పెరుగు అన్నంలో దానిమ్మ గింజలు, జీడిపప్పు మీద ఉండి చూస్తేనే నోరూరిపోతుంది. అయితే ఇలాంటి పెరుగన్నమే ఇంట్లో చేసుకోవాలంటే కొన్ని టిప్స్ పాటిస్తే సరిపోతుంది. రెస్టారెంట్ స్టైల్ పెరుగన్నం ఇంట్లోనే చాలా ఈజీగా తయారుచేసుకోడం ఎలా, దీని తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటో ఇక్కడ చూడండి. రెస్టారెంట్ స్టైల్ పెరుగు అన్నం తయారీకి కావాల్సిన పదార్థాలు -నీళ్లు- 300 ఎంఎల్ -పాలు- 125 ఎంఎల్ -పెరుగు- 300 ఎంఎల్ -అల్లంపచ్చిమిర్చి తరుము- 1 టీస్పూన్ -ఆవాలు -జీలకర్ర -ఇంగువ -ఆయిల్ -కరివేపాకు -కొత్తిమీర -జీడిపప్పు -దానిమ్మ గింజలు -ఫ్రెష్ క్రీమ్ రెస్టారెంట్ స్టైల్ పెరుగు అన్నం తయారీ విధానం -ముందుగా అరకప్పు బియ్యాన్ని గంటసేపు నానబెట్టండి. -తర్వాత స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో నానబెట్టిన బియ్యం, వాటర్, పాలు పోసి అన్నాన్ని మెత్తగా ఉడికించుకోవాలి. అన్నం పూర్తిగా ఉడికి చల్లారిపోయిన తర్వాత గరిటతో కచ్చాపచ్చాగా చిదుముకోవాలి. -ఇప్పుడు అందులో రుచికి సరిపడా ఉప్పు,పెరుగు, ఫ్రెష్ క్రీమ్, అల్లం పచ్చిమిర్చి తరుము వేసి బాగా కలిపి ఫ్రిడ్జ్ లో పెట్టేయండి. -తినబోయే ముందు స్టవ్ మీద పాన్ లో ఎండుమిర్చి, ఆవాలు,జీలకర్ర,ఇంగువ, కరివేపాకు వేసి వేపుకోండి. -ఈ తాలింపుని కలిపి పెట్టిన పెరుగు అన్నంలో వేసి కలపండి. -ఇప్పుడు పాన్ లో నెయ్యిలో 1 టీస్పూన్ జీడిపప్పుని దోరగా వేయించుకొని దానిని కూడా పెరుగు అన్నంలో వేసి కలపండి. ఇందులోనే దానిమ్మ గింజలు, కొత్తిమీర తరుగు వేసి కలిపితే రెస్టారెంట్ స్టైల్ కర్డ్ రైస్ రెడీ.

# సినిమా న్యూస్



# నిన్న భాగ్యశ్రీ.. నేడు రామ్.. రూమర్స్ పై క్లారిటీ



టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని- యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే మధ్య ఏదో సమ్ థింగ్ ఉందని ఎప్పటి నుంచో రూమర్లు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. వారిద్దరూ ఇప్పుడు కలిసి చేస్తున్న ఆంధ్రా కింగ్ తాలూకా మూవీ షూటింగ్ టైమ్ లో ప్రేమలో పడ్డారని.. కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఆ వార్తలపై భాగ్యశ్రీ ఇటీవల క్లారిటీ ఇచ్చి.. అవన్నీ రూమర్స్ అని పరోక్షంగా తేల్చేశారు. తాను ఎవరితో లవ్ లో లేనని ఇప్పటికే చెప్పిన ఆమె.. రీసెంట్ గా రామ్ తో తనకు మంచి ఫ్రెండ్ షిప్ ఉందని వెల్లడించారు. ఆయన చాలా హర్డ్ వర్కర్ అంటూ కొనియాడారు. అంతే కాదు.. తాను రామ్ ను ఆరాధిస్తానని కూడా చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఓ ఇంటర్వ్యూలో రిలేషన్ షిప్ రూమర్స్ పై స్పందించారు రామ్. తాను ఆంధ్రా కింగ్ తాలూకా మూవీ కోసం ఒక లవ్ సాంగ్ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి నుంచే రూమర్స్ మొదలయ్యాయని తెలిపారు. మనసులో ఏమీ లేకపోతే అంత గొప్పగా పాట ఎలా రాయగలరని అందరూ అనుకున్నారని రామ్ చెప్పుకొచ్చారు. కానీ తాను కేవలం సినిమాలోని హీరో, హీరోయిన్ పాత్రలను ఇమేజిన్ చేసుకుని లిరిక్స్ రాశానని తెలిపారు. అయితే అసలు ఆ పాట రాసినప్పటికి హీరోయిన్ ను ఇంకా సెలెక్ట్ కూడా చేయలేదని చెప్పారు. అలా పరోక్షంగా రిలేషన్ షిప్ రూమర్స్ ను తోసిపుచ్చారు. ప్రస్తుతం రామ్ కామెంట్స్.. సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. అయితే అదే ఇంటర్వ్యూలో తన గత మూవీ డబుల్ ఇస్మార్ట్ బాక్సాఫీస్ వద్ద ఫెయిల్యూర్ గురించి కూడా మాట్లాడారు. మంచి ఇంట్రెస్టింగ్ స్టోరీ అయినా.. రిజల్ట్ మాత్రం అనుకున్నట్లు రాలేదని తెలిపారు. సినిమాలో చాలా ఎమోషన్స్ ఉన్నాయని చెప్పిన రామ్.. అవి ఆడియన్స్ ను కనెక్ట్ అవ్వలేదని, అందుకే రిజల్ట్ అలా వచ్చిందని పేర్కొన్నారు. అయితే ఏ హీరో అయినా.. హీరోయిన్ అయినా.. సక్సెస్ అందుకోవాలంటే రెండు రీజన్స్ ఉండాలని తెలిపారు రామ్. ముఖ్యంగా ఎవరికి వారు తాము చేసే వర్క్ పై చాలా కాన్సంట్రేషన్ ఉండాలని అన్నారు. అంతే కాదు.. దాని కోసమే పుట్టామేమో అనిపించేలా చాలా హార్ట్ వర్క్ చేయాలని చెప్పారు. ఆ రెండు తనలో ఉన్నాయని చెప్పిన రామ్.. ఎప్పటికైనా భారీ విజయం సాధిస్తాననే నమ్మకం ఉందని తెలిపారు. మరి ఇప్పుడు ఆంధ్రా కింగ్ తాలూకా మూవీతో ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.

# రాజా సాబ్ ప్రభాస్ ఎనర్జీ కోసం ఫ్యాన్స్ రిపీట్ మోడ్..!



రెబల్ స్టార్ ప్రభాస్ ఎనర్జీ గురించి ఎంత చెప్పినా తక్కువే. బాహుబలి నుంచి ఆయన సినిమాల స్టామినా వసూళ్లు చేస్తున్న కలెక్షన్స్ చూసి ఫ్యాన్స్ సూపర్ హ్యాపీగా ఉన్నారు. ఐతే సలార్ వరకు ప్రభాస్ అన్నీ సీరియస్ రోల్స్ చేస్తున్నాడని ఫ్యాన్స్ ఫీల్ అయ్యారు. డార్లింగ్ టైం నాటి ప్రభాస్ ని చూడాలని.. బుజ్జిగాడు లాంటి పంచులు వేయాలని కోరుతున్నారు. అందుకే మారుతి డైరెక్షన్ లో రాజా సాబ్ సినిమా చేస్తూ ఫ్యాన్స్ కోరిక తీర్చేందుకు సిద్ధమయ్యాడు ప్రభాస్. రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్ సినిమాలో ఆయన క్యారెక్టరైజేషన్ నెక్స్ట్ లెవెల్ లో ఉంటుంది. ఎనర్జీ విషయంలో ప్రభాస్ ని చూసి అందరు షాక్ అవుతారని అంటున్నారు. ప్రభాస్ రాజా సాబ్ సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ ఎగ్జైట్మెంట్ కలిగిస్తుంది. ఎందుకంటే ఈ సినిమాలో ప్రభాస్ తన సీరియస్ మోడ్ నుంచి కామెడీకి షిఫ్ట్ అయ్యాడు. తన టైమింగ్, కామెడీతోనే ఫ్యాన్స్ ని ఖుషి చేయబోతున్నాడని టాక్. ప్రభాస్ యాక్షన్ సీన్స్ చేయడం కామనే కానీ ఎంటర్టైనింగ్ సీన్స్ ని ఫ్యాన్స్ సూపర్ గా ఎంజాయ్ చేస్తారు. ఈ క్రమంలో రాజా సాబ్ లోని ప్రభాస్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్ కి ఫ్యాన్స్ రిపీటెడ్ ఫుట్ ఫాల్స్ పడేలా ఉంటాయట. రెబల్ స్టార్ సినిమా అంటేనే ఫ్యాన్స్ కి ఫీస్ట్ అన్నట్టే. ఇక ఆ సినిమా అంచనాలకు తగినట్టుగా వస్తే మాత్రం ఇక ఆ రేంజ్ వేరే అని చెప్పొచ్చు. కల్కి 2898 ఏడి తర్వాత ప్రభా రాజా సాబ్ తో ఆడియన్స్ ముందుకు వస్తున్నాడు. ఈ సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకునే ప్లాన్ లో ఉన్నాడు. రాజా సాబ్ సినిమాలో ప్రభాస్ డిఫరెంట్ రోల్స్ తో సర్ ప్రైజ్ చేస్తారట. అంతేకాదు రెబల్ స్టార్ సరసన అందమైన భామలు మాళవిక, నిధి అగర్వాల్ కూడా సినిమాకు మరింత ఎనర్జీ తెస్తాయని తెలుస్తుంది. సో రెబల్ స్టార్ రెబలిజం మాత్రమే కాదు ఎంటర్టైనింగ్ మోడ్ తో కూడా ఫ్యాన్ ఫీస్ట్ అందించేందుకు రాజా సాబ్ వస్తున్నాడని అంటున్నారు. రాజా సాబ్ సినిమా 2026 సంక్రాంతికి రిలీజ్ లాక్ చేశారు. థమన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా మ్యూజిక్ విషయంలో కూడా నెక్స్ట్ లెవెల్ లో ఉండబోతుందని తెలుస్తుంది. ఈ సినిమాతో పాటే ప్రభాస్ హను రాఘవపూడి తో ఫౌజీ సినిమా చేస్తున్నాడు. ఆ సినిమా తర్వాత సందీప్ వంగ స్పిరిట్ కూడా సెట్స్ మీదకు వెళ్తుంది. ఈ సినిమాలతో ప్రభాస్ మరోసారి బాక్సాఫీస్ పై తన మార్క్ చూపించబోతున్నాడని చెప్పొచ్చు.

# హార్దిక్ పాండ్యా రహస్యంగా నిశ్చితార్థం?



టీమిండియా ట్యాలెంటెడ్ క్రికెటర్ హార్థిక్ పాండ్యా తన భార్య నటాషా స్టాంకోవిక్ నుంచి విడిపోయిన తర్వాత అతడి ఎఫైర్ల జాబితా అంతకంతకు పెద్దదవుతోంది. ఇంతకుముందు విదేశీ మోడల్ జాస్మిన్ వాలియాతో డేటింగ్ చేస్తున్నాడంటూ ప్రచారమైంది. ఈ ఇద్దరూ సోషల్ మీడియాల్లో ఒకరినొకరు అనుసరించడం దీనికి ఆజ్యం పోసింది. ఆ తర్వాత జాస్మిన్ వాలియా అతడి నుంచి బ్రేకప్ అయింది. ఇటీవల హార్దిక్ పాండ్యా నటి కం మోడల్ మహికా శర్మతో సీక్రెట్ గా డేటింగ్ చేస్తున్నాడంటూ ప్రచారం సాగుతోంది. పలుమార్లు ఈ జోడీ పబ్లిక్ అప్పియరెన్సులు పుకార్లకు ఊతమిచ్చాయి. ఇటీవల మహికను ఓ జిమ్ లో ఎత్తుకుని వెళుతున్న హార్థిక్ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లోకి దూసుకొచ్చాయి. ఆ ఇద్దరి మధ్యా చనువు మితిమీరిందంటూ గుసగుసలు వినిపించాయి. ఇంతలోనే ఇప్పుడు ఈ జంట రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నారని సోషల్ మీడియాలో గుసగుసలు మొదలయ్యాయి. ఆ ఇద్దరి నుంచి ఇటీవలి కొన్ని సోషల్ మీడియా పోస్టులు ఈ తరహా చర్చకు దారితీసాయి. మహీక ఉంగరపు వేలుపై మెరిసే పెద్ద ఉంగరాన్ని ఫ్యాన్స్ గమనించిన తర్వాత పాండ్యాతో రహస్యంగా నిశ్చితార్థం అయిందని ఊహాగానాలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఈ నిశ్చితార్థపు ఉంగరం తాలూకా స్క్రీన్‌షాట్లు అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. మహీకశర్మ ధరించిన ఆభరణాలలో ఈ అంగుళీకం ప్రత్యేకంగా అందరి దృష్టిని ఆకర్షించింది. వజ్రాల ఉంగరం తళతళల గురించి ముచ్చట్లు మొదలయ్యాయి. అయితే ఆ ఇద్దరూ నిశ్చితార్థాన్ని నిర్ధారిస్తూ ఎటువంటి బహిరంగ ప్రకటన విడుదల చేయలేదు. ప్రస్తుతానికి ఇవన్నీ ఊహాగానాలుగానే భావించాలి. జూలై 2024లో హార్థిక్- నటాషా జంట విడిపోతున్న విషయం బహిర్గతమైంది. ఆ తర్వాత విడాకులను అధికారికంగా ధృవీకరించారు. ప్రస్తుతం అగస్త్యకు ఏ లోటు రానివ్వకుండా సహతల్లిదండ్రులుగా కొనసాగుతున్నారు. పాండ్యా - మహికా జంటపై ఇటీవలే రూమర్లు మొదలయ్యాయి.

# దేవర 2: బిగ్ షాక్ తప్పదా?



బాక్సాఫీస్ విజయాలు వచ్చినప్పుడు సీక్వెల్స్ ప్రకటించడం ఈ మధ్య కామన్ అయిపోయింది. కానీ ఆప్రకటించిన ఉత్సాహం చివరి వరకు కొనసాగించడం కత్తి మీద సాము లాంటిది. 'దేవర' సినిమాకు మిక్స్ డ్ టాక్ వచ్చినా బాక్సాఫీస్ ను షేక్ చేసిన ఎన్టీఆర్ కొరటాల తప్పకుండా,పార్ట్-2 చేస్తారని అందరూ అనుకున్నారు.కానీ ఆ విషయంలో మాత్రం వెనకడుగు వేస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. నిన్న మొన్నటి వరకు షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందాఅని అంతా అనుకున్నారు. కానీ ఇప్పుడు సీన్ మొత్తం రివర్స్ అయింది. ఈ సినిమా ఇక సెట్స్ పైకి వెళ్ళే ఛాన్స్ లేదని, ప్రాజెక్ట్ ను పూర్తిగా నిలిపివేశారని టాక్ బలంగా వినిపిస్తోంది. అయితే ఇది డేట్స్ అడ్జస్ట్ కాకనో, బడ్జెట్ కుదరకనో తీసుకున్న నిర్ణయం కాదు. దీని వెనుక బలమైన "క్రియేటివ్" కారణమే ఉందని ఇండస్ట్రీ టాక్. అసలు విషయానికొస్తే.. దర్శకుడు కొరటాల శివ, సీక్వెల్ కోసం కొత్త వెర్షన్ డ్రాఫ్ట్ ను సిద్ధం చేసి ఎన్టీఆర్ కు వినిపించారట.కానీ ఆకథ తారక్ ను మెప్పించలేక పోయిందని సమాచారం. మొదటి భాగానికి కొనసాగింపుగా కథ సహజంగా సాగలేదని, ఏదోబలవంతంగా సాగదీసినట్లు అనిపించిం దట. కేవలం సీక్వెల్ అనౌన్స్ చేశాం కాబట్టి చేయడం ఎందుకని తారక్ పునరాలోచనలో పడ్డారట. బలమైన కథ లేకుండా ముందుకెళ్తే, మొదటి పార్ట్ తెచ్చిన మిక్స్ డ్ టాక్ వలన మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉందని అనుకుంటున్నారట.అందుకే కాంప్రమైజ్ అయ్యి సినిమా చేయడంకంటే,ప్రాజెక్ట్‌నుపక్కనపెట్టడమే మంచిదని ఎన్టీఆర్ భావించినట్లు తెలుస్తోంది. ఇది కఠినమైన నిర్ణయమే అయినా, లాంగ్ రన్ కెరీర్ పరంగా చూస్తే, క్వాలిటీ విషయంలో రాజీపడకపోవడం చాలా మంచి నిర్ణయం అని విశ్లేషకులు అంటున్నారు.మరి ఇది ఎంతవరకు నిజమో తెలియాలి అంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే. దేవర 2 విషయంలోసందిగ్ధతఉన్నా,ఎన్టీఆర్ లైనప్ మాత్రం స్ట్రాంగ్ గా ఉంది.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com